VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : ఆదివారం 28.06.2026
సంపుటి : 08 సంచిక : 19 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com




## ఇందిరమ్మ ఇళ్ల శ్లాబ్ సైజుపై కొత్త నిబంధనలు

# నేడు నల్లగొండలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

- నల్గొండ జిల్లాలో నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన
- మధ్యాహ్నం 3.35 గంటలకు కనగల్ ఏఎంసీ మార్కెట్ యార్డుకు చేరుకోనున్న సీఎం
- హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (HAM) రోడ్ల పనులకు శంకుస్థాపన
- పైలాన్‌ను ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి
- సాయంత్రం 4 గంటలకు నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానానికి రానున్న సీఎం
- రూ.83 కోట్లతో డ్రింకింగ్ వాటర్ స్కీమ్–ఫేజ్-1కు శంకుస్థాపన
- నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ తాగునీటి ప్రాజెక్టుకు శ్రీకారం

అభివృద్ధి పనుల అనంతరం బహిరంగ సభలో పాల్గొననున్న సీఎం

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్న రేవంత్ రెడ్డి
- సీఎం పర్యటనతో జిల్లాలో అధికార యంత్రాంగం అప్రమత్తం



**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**

నల్గొండ జిల్లాలో నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3.35 గంటలకు కనగల్ ఏఎంసీ మార్కెట్ యార్డ్ ప్రాంగణానికి చేరుకుని హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (HAM) రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు.అనంతరం సాయంత్రం 4 గంటలకు నల్గొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుని రూ.83 కోట్ల వ్యయంతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టనున్న డ్రింకింగ్ వాటర్ స్కీమ్–ఫేజ్–1 పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, భద్రతను కట్టుదిట్టం చేసింది.

## ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుంది

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.




## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించం: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- రైతులు, గ్రామీణ పేదలకు తీవ్ర నష్టం కలిగించే చట్టమని వ్యాఖ్య
- తెలంగాణ క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో విస్తృత చర్చ
- చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లే యోచన




## హైదరాబాద్‌లో అక్రమ రోహింగ్యాలు..

- ఎవరెన్ని కుట్రలు చేసినా సర్ ప్రక్రియ ఆగదు: కిషన్ రెడ్డి న్‌రెడ్డి
- నగరంలో పెద్ద సంఖ్యలో అక్రమ రోహింగ్యాలు ఉన్నాయని వ్యాఖ్య

2

## రైతు భరోసాకు కొత్త రైతుల నమోదు ప్రారంభం

- కొత్త రైతులకు మరో అవకాశం
- జులై 5 వరకు దరఖాస్తులు
- ఆఫ్‌లైన్‌లోనే అప్లికేషన్
- జూన్ 15 నాటికి పాస్‌బుక్ తప్పనిసరి
- ఏడాదికి ఎకరానికి రూ.12 వేల సాయం
- అవసరమైన పత్రాలివే
- ఏఈఓ, ఎంపీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు
- సీసీఎల్‌ఏ డేటాతో పరిశీలన

2

# తిరుమలలో భక్తుల రద్దీ.. 18 గంటల నిరీక్షణ




- సెలవులతో శ్రీవారి దర్శనానికి భారీగా భక్తులు
- వైకుంఠ క్యూ కాంప్లెక్సులు పూర్తిగా నిండిన పరిస్థితి
- నారాయణగిరి షెడ్లలోనూ కిక్కిరిసిన భక్తులు
- టోకెన్లు లేని వారికి 18 గంటల వేచి ఉండాల్సిన పరిస్థితి
- తిరుపతిలో టోకెన్ల కోసం భారీ క్యూలు
- రద్దీ కారణంగా ముందుగానే టోకెన్ల జారీ
- భక్తులకు అల్పాహారం, పాలు, నీటి పంపిణీ
- శ్రీవారి సేవకుల ద్వారా నిరంతర సేవలు
- రద్దీని నియంత్రించేందుకు టీటీడీ ప్రత్యేక చర్యలు
- భక్తులు సహకరించాలని టీటీడీ విజ్ఞప్తి

**తిరుపతి వెలుతురు జూన్ 27:**

సెలవుల నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో కొండపై అన్ని క్యూ లైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

## మూడు రాష్ట్రాల సీఎంల భేటీ వివరాలు వెల్లడించాలి: హరీశ్‌రావు




- హోస్పేట భేటీపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- రహస్య ఒప్పందాల వివరాలు ప్రజలకు చెప్పాలి
- శాసనసభలో ఒప్పందాలను ప్రవేశపెట్టాలి

## MSME లతో భారత ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చు: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

- ఉపాధి కల్పన, సమ్మిళిత అభివృద్ధికి యువ పారిశ్రామికవేత్తలే కీలకం
- ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది

**హైదరాబాద్, వెలుతురు జూన్ 27, 2026:**

మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈలు) భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటివని, ఉపాధి కల్పనతో పాటు ఆర్థిక అసమానతలను తగ్గించడంలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.




▶ మిగతా 10లో

## ములుగు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

- రామప్ప–లక్నవరం గ్రావిటీ కెనాల్‌కు భూముల ప్రస్తుత ధరలకు అనుగుణంగా భూసేకరణ చేపట్టాలి
- పాత భూసేకరణ అవార్డును ఉపసంహరించి రైతులకు న్యాయం చేయాలి
- పొట్లాపూర్ ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలి
- ఆదేశించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క

**హైదరాబాద్, వెలుతురు జూన్ 27:**




ములుగు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు శాశ్వత సాగునీరు అందించేలా చర్యలు వేగవంతం చేయాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రామప్ప–లక్నవరం గ్రావిటీ కెనాల్, పొట్లాపూర్ ప్రాజెక్టుతో పాటు జిల్లాలో కొనసాగుతున్న అన్ని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

## ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలి: జూపల్లి

- అర్హులైన ఒక్క ఓటు కూడా గల్లంతు కాకూడదు..
- హక్కు పరిరక్షణకు బూత్ ఏజెంట్లు ముందుండాలని పిలుపు
- పార్టీ శ్రేణులకు మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు

**ఆదిలాబాద్, వెలుతురు జూన్ 27 :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సవాల్‌గా తీసుకోవాలని, అర్హులైన ఒక్క ఓటు కూడా గల్లంతు కాకుండా అప్రమత్తంగా పనిచేయాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి జూపల్లి కృష్ణారావు సూచించారు. ఓటు గల్లంతైతే అది వ్యక్తిగత నష్టమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థకే దెబ్బ అని అన్నారు.ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తానీషా ఫంక్షన్ హాల్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీ శ్రేణులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.బీహార్, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా సవరణపై తలెత్తిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలో ఓట్ల గల్లంతు కాకుండా కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా వలస వెళ్లిన కుటుంబాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్లు తొలగింపునకు గురయ్యే అవకాశాలు ఉన్నందున వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్‌లు.. ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ స్థాయి నుంచే ఓటు హక్కును పరిరక్షించే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని పేర్కొన్నారు.




▶ మిగతా 12లో

# ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి...

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు.ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారి నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తు చేశారు.సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు.ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు.దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే ప్రక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీ లో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు.ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన ప్రక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.మాట మీద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన ప్రక్రియ గురించి భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీ లో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుంది దీనిని సమస్త కార్మిక లోకం గమనించగలరు.

# వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించం: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- కేరళ, కర్ణాటకతో కలిసి ఉమ్మడి కార్యాచరణకు నిర్ణయం
- రైతుల హక్కులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
- పేదల భవిష్యత్‌ను తాకట్టు పెట్టే చట్టమని విమర్శ
- అమలుపై ప్రభుత్వం న్యాయపరమైన అవకాశాల పరిశీలన
- మంత్రులు సీతక్క, తుమ్మల, వివేక్ హాజరు
- తదుపరి కార్యాచరణపై త్వరలో తుది నిర్ణయం
- ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమన్న ఉత్తమ్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**

వీబీజీ రామ్‌జీ చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టం రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని, వారి ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు, పేదల భవిష్యత్‌కు భంగం కలిగించే ఏ చట్టాన్నీ తెలంగాణ ప్రభుత్వం సమర్థించదని ఆయన స్పష్టం చేశారు.వీబీజీ రామ్‌జీ పథకానికి సంబంధించిన అంశాలపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్‌కమిటీ శనివారం సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం వల్ల రాష్ట్రంపై పడే ప్రభావం, రైతులు, గ్రామీణ వర్గాలపై ఏర్పడే పరిస్థితులు, ప్రభుత్వం అనుసరించాల్సిన న్యాయ, పరిపాలనా చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు.సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మొదటి నుంచే రైతుల ప్రయోజనాలకు కట్టుబడి ఉందన్నారు. రైతుల ఆదాయం పెరగడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తరించడం, వ్యవసాయ రంగం బలోపేతం కావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అలాంటి సమయంలో రైతులకు నష్టం కలిగించే చట్టాలను అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. వీబీజీ రామ్‌జీ చట్టం అమల్లోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని, పేదల జీవనోపాధిపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రతి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.



ఈ చట్టాన్ని న్యాయపరంగా సవాలు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు. చట్టంలోని నిబంధనలను నిపుణులతో పరిశీలించి, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణతో పాటు రాష్ట్ర హక్కులను కాపాడేందుకు అందుబాటులో ఉన్న అన్ని న్యాయపరమైన మార్గాలను వినియోగిస్తామని స్పష్టం చేశారు.ఈ విషయంలో తెలంగాణ ఒక్క రాష్ట్రంగా కాకుండా, ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్న ఇతర రాష్ట్రాలతో కలిసి ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి ఉమ్మడి కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అవసరమైతే ఇతర రాష్ట్రాలను కూడా ఈ పోరాటంలో భాగస్వాములను చేస్తామని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల సంక్షేమం విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల జీవనోపాధికి విఘాతం కలిగించే ఏ నిర్ణయాన్నైనా చట్టపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యతిరేకిస్తామని చెప్పారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, వారి హక్కులను పరిరక్షించేందుకు అవసరమైన ప్రతి చర్య తీసుకుంటామని తెలిపారు.

క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో చట్టంలోని వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు సమాచారం. చట్టం అమలైతే రాష్ట్రంలో ఉపాధి, వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వివిధ శాఖల నుంచి వచ్చిన నివేదికలను కూడా కమిటీ పరిశీలించింది.ప్రభుత్వం న్యాయ నిపుణుల అభిప్రాయాలను సేకరించి తదుపరి కార్యాచరణపై తుది నిర్ణయం తీసుకోనుంది. అవసరమైతే ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి వ్యూహాన్ని అమలు చేయడంతో పాటు న్యాయపోరాటాన్ని కూడా కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.రైతుల ప్రయోజనాలు, గ్రామీణ పేదల సంక్షేమం, రాష్ట్ర హక్కుల పరిరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. రైతులపై భారం మోపే, గ్రామీణ పేదల జీవనోపాధిని దెబ్బతీసే ఏ చట్టాన్నైనా వ్యతిరేకిస్తామని, ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల శ్లాబ్ సైజుపై కొత్త నిబంధనలు

- 500 నుంచి 750 చదరపు అడుగులకే శ్లాబ్ పరిమితం
- శ్లాబ్ విస్తీర్ణంపై తెలంగాణ ప్రభుత్వం కీలక జీవో
- ముందు వైపు 3 అడుగులు.. మిగతా వైపులా ఒక్క అడుగే
- గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఉత్తర్వులు
- లబ్ధిదారులపై అదనపు భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం
- శ్లాబ్ విస్తీర్ణం పెరగడంతో నిర్మాణ వ్యయం అధికమవుతున్నట్లు గుర్తింపు
- ఏకరీతి నమూనాతో ఇళ్ల నిర్మాణానికి మార్గదర్శకాలు
- ప్రభుత్వ నిధుల సద్వినియోగానికి కొత్త నిబంధనలు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వ్యయ నియంత్రణకు ప్రాధాన్యం
- కొత్త నిబంధనలు రాష్ట్రవ్యాప్తంగా అమలు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో శ్లాబ్ విస్తీర్ణానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇళ్ల నిర్మాణ వ్యయం పెరగకుండా, లబ్ధిదారులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఉండేలా శ్లాబ్ సైజుపై స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఉత్తర్వులు విడుదల చేశారు. కొత్త నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల శ్లాబ్ విస్తీర్ణం 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్య మాత్రమే ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే శ్లాబ్‌కు ఇంటి ముందు భాగంలో గరిష్ఠంగా మూడు అడుగుల ప్రొజెక్షన్ (ఓవర్‌హ్యాంగ్) ఉండగా, మిగతా మూడు వైపులా ఒక్క అడుగు మాత్రమే ఉండాలని పేర్కొంది.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు పక్కా ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుండగా, లబ్ధిదారులు కూడా కొంత మొత్తం భరించి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారు. అయితే ఇటీవల కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులు అనుమతించిన పరిమితికి మించి శ్లాబ్ విస్తీర్ణాన్ని పెంచుతున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ దృష్టికి వచ్చింది. దీంతో సిమెంట్, ఇనుము, కాంక్రీట్ తదితర నిర్మాణ సామగ్రి వినియోగం పెరిగి నిర్మాణ వ్యయం కూడా గణనీయంగా అధికమవుతోందని అధికారులు గుర్తించారు.శ్లాబ్ విస్తీర్ణం పెరగడం వల్ల ప్రభుత్వం మంజూరు చేసే నిధులు సరిపోక, అదనపు ఖర్చు లబ్ధిదారులపై పడుతున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ ప్రభుత్వానికి నివేదించింది. చాలా మంది లబ్ధిదారులు అప్పులు చేసి నిర్మాణం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, దీని వల్ల ఇళ్ల నిర్మాణం ఆలస్యమవుతోందని కూడా అధికారులు పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్మాణ వ్యయాన్ని నియంత్రించే దిశగా కొత్త మార్గదర్శకాలను తీసుకొచ్చింది.కొత్త ఉత్తర్వుల ప్రకారం శ్లాబ్ పరిమాణాన్ని నిర్ణీత ప్రమాణాలకు లోబడి నిర్మించాల్సి ఉంటుంది. ఇంటి ముందు భాగంలో మూడు అడుగుల వరకు మాత్రమే ప్రొజెక్షన్‌కు అనుమతి ఉంటుంది. ఇది వర్షపు నీరు నేరుగా గోడలపై పడకుండా ఉండటంతో పాటు ఇంటి ముందు భాగంలో కొంత రక్షణ కల్పించేందుకు ఉపయోగపడుతుంది. అయితే మిగతా మూడు వైపులా ఒక అడుగు కంటే ఎక్కువ ప్రొజెక్షన్ ఉండకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిబంధనలతో అవసరానికి మించిన నిర్మాణాలను నివారించి వ్యయాన్ని తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఒకవైపు నాణ్యతను కాపాడుతూనే మరోవైపు నిర్మాణ వ్యయాన్ని అదుపులో ఉంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇదే నమూనా అమలులో ఉండేలా జిల్లా కలెక్టర్లు, హౌసింగ్ అధికారులు, ఇంజినీర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా నిర్మాణాలు ప్రారంభించే వారు తప్పనిసరిగా ఈ నిబంధనలను పాటించాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన నమూనాను అనుసరించడం వల్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు వ్యయ అంచనాలు కూడా ఒకే విధంగా ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రతి ఇంటికి అవసరమైన నిర్మాణ సామగ్రి పరిమాణాన్ని ముందుగానే అంచనా వేయడం సులభమవుతుందని, దీనివల్ల నిధుల వినియోగంలో పారదర్శకత కూడా పెరుగుతుందని భావిస్తున్నారు.హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఇటీవల నిర్మాణ సామగ్రి ధరలు గణనీయంగా పెరిగాయి. సిమెంట్, స్టీల్, ఇసుక, కంకర, కూలీల చార్జీలు పెరగడంతో ఇళ్ల నిర్మాణ వ్యయం కూడా పెరిగింది. ఈ పరిస్థితుల్లో శ్లాబ్ విస్తీర్ణాన్ని అవసరానికి మించి పెంచితే లబ్ధిదారులపై మరింత ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. అందుకే నిర్మాణ వ్యయాన్ని నియంత్రించేందుకు ఈ పరిమితులు విధించినట్లు అధికారులు వివరించారు.కొత్త నిబంధనల అమలుతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఏకరీతి ప్రమాణాలు పాటించే అవకాశం ఉంది. నిర్మాణ నాణ్యతను కాపాడుతూ, అనవసర వ్యయాన్ని తగ్గించడంతో పాటు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం సద్వినియోగం అయ్యేలా ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే లబ్ధిదారులు అదనపు అప్పుల భారం లేకుండా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకునేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వులు నిర్మాణ ప్రక్రియలో కీలక మార్పులకు దారితీయనున్నాయి. ఇకపై అన్ని కొత్త నిర్మాణాలు ఈ మార్గదర్శకాల ప్రకారమే చేపట్టాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# హైదరాబాద్‌లో అక్రమ రోహింగ్యాలు..

- పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారికి ఓట్లు, రేషన్ కార్డులున్నాయన్న ఆరోపణ
- పాతబస్తీలో బీఎల్‌వోలను మజ్లిస్ నేతలు బెదిరిస్తున్నారని విమర్శ
- ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న కిషన్‌రెడ్డి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని మండిపాటు
- రామ్‌కోఠిలో కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించిన కేంద్ర మంత్రి
- చిన్నారులకు పాఠ్యపుస్తకాల పంపిణీ
- ఖైరతాబాద్‌లో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన కిషన్‌రెడ్డి
- అక్రమ చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**

నగరంలో పెద్ద సంఖ్యలో రోహింగ్యాలు అక్రమంగా నివసిస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి వచ్చిన వారికి హైదరాబాద్‌లో ఓటరు గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులు, బ్యాంకు ఖాతాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి అంశాలను అత్యంత తీవ్రంగా పరిగణించి సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.శనివారం రామ్‌కోఠిలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కిషన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. తర్వాత ఖైరతాబాద్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ కార్యక్రమాల అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కిషన్‌రెడ్డి.. పాతబస్తీలో బూత్ లెవల్ ఆఫీసర్లను (బీఎల్‌వోలు) మజ్లిస్ నాయకులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రభావితం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఓటరు జాబితా ప్రక్షాళనను రాజకీయ రంగు పులమడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అడ్డుకోలేరని స్పష్టం చేశారు.ఓటరు జాబితాలో అక్రమంగా పేర్లు నమోదైన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవడం ఎన్నికల సంఘం బాధ్యత అని కిషన్‌రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని, అదే సమయంలో అక్రమంగా దేశంలోకి వచ్చిన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉండకూడదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగేందుకు అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# రైతు భరోసాకు కొత్త రైతుల నమోదు ప్రారంభం

- కొత్త సీజన్ నుంచే లబ్ధి
- జూన్ 30న రైతు భరోసా నిధుల విడుదల

**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**

తెలంగాణ ప్రభుత్వం రైతులకు మరో శుభవార్త అందించింది. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతిష్ఠాత్మక రైతు భరోసా పథకం పరిధిని మరింత విస్తరించేందుకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులకు నమోదు అవకాశం కల్పించింది. ఈ మేరకు కొత్త దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను వ్యవసాయశాఖ ప్రారంభించింది. ఇప్పటివరకు రైతు భరోసా పథకంలో చేరని అర్హులైన రైతులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

### ఏడాదికి ఎకరానికి రూ.12 వేల సాయం

రైతులకు పెట్టుబడి భారం తగ్గించేందుకు 2018లో రైతు బంధు పేరుతో ప్రారంభించిన ఈ పథకం ప్రస్తుతం రైతు భరోసా పేరుతో కొనసాగుతోంది. ఈ పథకం కింద అర్హులైన రైతులకు ఎకరానికి సంవత్సరానికి రూ.12 వేల చొప్పున రెండు విడతల్లో (వానాకాలం, యాసంగి) పెట్టుబడి సాయం అందజేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు.

### ఎవరు అర్హులు?

వ్యవసాయశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, 2026 జూన్ 15 నాటికి భూములు కొనుగోలు చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఇప్పటివరకు ఈ పథకానికి నమోదు




చేసుకోని అర్హులైన రైతులు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

అవసరమైన పత్రాలు
రైతు భరోసా దరఖాస్తు ఫారమ్
పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్
ఆధార్ కార్డు జిరాక్స్
బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్

దరఖాస్తు చేయాలి?

రైతు భరోసా పథకానికి కేవలం ఆఫ్‌లైన్ విధానంలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసే అవకాశం లేదని వ్యవసాయశాఖ స్పష్టం చేసింది.అర్హులైన రైతులు అవసరమైన పత్రాలతో తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) లేదా మండల వ్యవసాయ అధికారి (MAO) కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలి. అనంతరం అధికారులు సీసీఎల్ఏ (CCLA) డేటాతో భూ వివరాలను పరిశీలించి రైతు భరోసా పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తారు. ధృవీకరణ పూర్తైన తర్వాత కొత్త రైతులను లబ్ధిదారుల జాబితాలో చేర్చనున్నట్లు తెలిపారు.

### చివరి తేదీ ఇదే

కొత్తగా రైతు భరోసా పథకంలో చేరాలనుకునే రైతులు 2026 జులై 5లోపు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ సూచించింది. చివరి తేదీ వరకు వేచి చూడకుండా అవసరమైన పత్రాలతో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

### జూన్ 30న రైతు భరోసా నిధుల విడుదల

వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ప్రభుత్వం మరో గుడ్‌న్యూస్ చెప్పింది. రైతు భరోసా వానాకాలం విడత నిధులను జూన్ 30న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఖమ్మం జిల్లా మధిరలో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు. ఈ విడతలో అర్హులైన రైతుల ఖాతాల్లో నేరుగా పెట్టుబడి సాయం జమ కానుంది.

# “అయోధ్య రాముని పేరుతో దోచుకున్నదెంత? దాచుకున్నదెంత? – సమగ్ర దర్యాప్తు జరగాలి: పి. ప్రసన్న కుమార్ శర్మ”



హైదరాబాద్ వెలుతురు జూన్ 27:

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ మాట్లాడుతూ, అయోధ్య శ్రీరామాలయ నిర్మాణం కోసం గత దాదాపు నలభై సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు బంగారం, వెండి, ప్లాటినం, నగదు రూపంలో వేల కోట్ల రూపాయలను విరాళాలుగా సమర్పించారని అన్నారు. అయితే ఆ విరాళాలు అందజేసిన అనేక మంది భక్తులకు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ కనీసం రసీదు కూడా ఇవ్వలేదనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రచారంలో ఉన్నది కేవలం రూ.7.50 కోట్ల స్కాం కాదని, వాస్తవానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల కోట్లకు పైగా అవకతవకలు జరిగి ఉండవచ్చని ఉత్తరప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా ప్రజలు చర్చించుకుంటున్నారని ఆయన అన్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర, స్వతంత్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు.శ్రీరాముని పేరును, హిందూ మత విశ్వాసాలను రాజకీయంగా ఉపయోగించుకొని దేశ ప్రజల నుంచి ఓట్లు పొందిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ అంశంపై మౌనం వీడి స్పందించాలని ఆయన కోరారు. కేవలం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ తో ఈ వ్యవహారాన్ని ముగించే ప్రయత్నం ప్రజల్లో విశ్వాసాన్ని కలిగించదని అన్నారు.చిన్న వ్యాపారులు, కాంగ్రెస్ నాయకులు లేదా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న వ్యాపారులపై వెంటనే ఈడీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థలను ఉపయోగించే ప్రభుత్వం, శ్రీరామ జన్మభూమికి సంబంధించిన ఇంత తీవ్రమైన ఆరోపణల విషయంలో మాత్రం అదే సంస్థలతో విచారణ జరపకుండా కేవలం రాష్ట్ర స్థాయి సిట్ కే పరిమితం కావడం సమంజసం కాదని విమర్శించారు.అన్ని ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులతో కూడిన అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేసి, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ, ఈడీలతో పూర్తిస్థాయి, నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిగి, నిజాలు వెలుగులోకి వచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ, కార్యకర్తలు, దేశ ప్రజలు, శ్రీరామ భక్తులతో కలిసి పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉన్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భారతదేశ ప్రజల ఆరాధ్యదైవమైన శ్రీరాముని పేరుతో జరిగిందని ఆరోపిస్తున్న ఈ వ్యవహారంపై బాధ్యులు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని పి. ప్రసన్న కుమార్ శర్మ డిమాండ్ చేశారు.

**దేశం కోసం ధర్మం కోసం... శ్రీరామ రక్ష ,సర్వ జగత్ రక్షణ కేవలం కాంగ్రెస్ పార్టీ తో మాత్రమే సాధ్యం...**

ప్రభు శ్రీరాముడి ఆలయంలో కోట్ల రూపాయల అవినీతి జరిగిన తర్వాత, ఇప్పుడు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యుడు చంపత్ రాయ్ రాజీనామా చేశారనే వార్తలు వస్తున్నాయి. అంటే, పని పూర్తయ్యాక బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అయితే, ఇంత పెద్ద ఆరోపణలు ఎదుర్కొంటున్న సమయంలో కేవలం రాజీనామా చేసి బయటపడటం సరిపోదు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ రాజీనామానే రామాలయంలోని కానుకల నిర్వహణపై తీవ్రమైన అవకతవకలు జరిగాయనే అనుమానాలకు బలం చేకూరుస్తోందని, చంపత్ రాయ్ కేవలం రాజీనామాతో తప్పించుకోవాలని చూస్తున్నారని ఆరోపిస్తున్నారు.మొదటి రోజు నుంచే మొత్తం వ్యవస్థ చంపత్ రాయ్‌ను, అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న వర్గాన్ని కాపాడేందుకు ప్రయత్నించిందని కూడా విమర్శలు ఉన్నాయి.సిట్ దర్యాప్తు కూడా కేవలం నామమాత్రంగా నిర్వహించబడిందని, అసలు నిందితులకు సమయం కల్పించి ఆధారాలు మాయం చేసుకునే అవకాశం ఇచ్చిందని ఆరోపిస్తున్నారు.చాలామంది భక్తులు తాము ఆలయానికి సమర్పించేందుకు బంగారం, వెండి చంపత్ రాయ్‌కు ఇచ్చామని, కానీ ఇప్పటివరకు తమకు ఎలాంటి రసీదు ఇవ్వలేదని చెబుతున్నారని, ఇది అవకతవకల స్థాయి ఎంత పెద్దదో చూపిస్తోందని ఆరోపిస్తున్నారు.కోట్లాది హిందువుల విశ్వాసానికి ప్రతీక అయిన ఆలయంలో భక్తుల కానుకల విషయంలో అవినీతి జరగడం మహాపాపమని, దానికి కేవలం రాజీనామా శిక్షగా సరిపోదని అంటున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర, నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని, చంపత్ రాయ్‌పై కూడా FIR నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అలాగే, ఈ మొత్తం ట్రస్ట్‌ను కూడా రద్దు చేయాలని, ఎందుకంటే దొంగతనం జరిగిందని ఆరోపిస్తున్నారు.అంతేకాకుండా, రామాలయ



శిలాన్యాసం నుంచి ప్రారంభోత్సవం, ప్రాణ ప్రతిష్ఠ, ధ్వజారోహణ వంటి కార్యక్రమాల్లో పాల్గొన్న నరేంద్ర మోదీ కూడా ఈ అంశంపై మౌనం పాటించకూడదని, ఈ ఆరోపణలపై స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

# నీట్ పరీక్ష విజయంపై ప్రధాని ప్రశంసలు స్వాగతించదగినవే... మరి పేపర్ లీక్ సమయంలో మౌనం ఎందుకు?

హైదరాబాద్ వెలుతురు జూన్ 27:


ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల నీట్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించినందుకు సంబంధిత అధికారులు, కేంద్ర మంత్రులను అభినందించడం సంతోషకరమైన విషయమే. పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించాలి.అయితే, గతంలో నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావడంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురైనప్పుడు ప్రధానమంత్రి ఎందుకు స్పందించలేదు? ఆ సమయంలో బాధ్యులపై ఎందుకు గట్టిగా ప్రశ్నించలేదు? దేశ యువత భవిష్యత్తుతో ముడిపడిన అంత కీలకమైన అంశంపై ఎందుకు మౌనం వహించారు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.విజయం సాధించినప్పుడు ప్రశంసలు అందించడం ఎంత ముఖ్యమో, వ్యవస్థలో లోపాలు బయటపడినప్పుడు బాధ్యతను నిర్ధారించడం కూడా అంతే ముఖ్యం. విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకుండా, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.దేశ యువతకు నమ్మకం కలిగించేలా, ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, గతంలో జరిగిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కూడా ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది.

**విద్యార్థుల విషాదంలో మౌనం... విజయంలో ప్రశంసలా?**

నీట్ పరీక్షలు సజావుగా నిర్వహించబడినందుకు సంబంధిత అధికారులను, మంత్రులను అభినందించడం మంచి విషయమే. మంచి పని చేసిన వారిని ప్రశంసించడం ప్రతి నాయకుడి బాధ్యత.అయితే, గతంలో నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావడంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. పరీక్షా వ్యవస్థపై నమ్మకం దెబ్బతింది. ఆ సమయంలో దేశ అత్యున్నత నాయకత్వం నుంచి విద్యార్థులకు భరోసా కల్పించే సందేశం రావాలని ప్రజలు ఆశించారు.అలాగే, నీట్ పరీక్షల నేపథ్యంలో చోటుచేసుకున్న విషాద ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను కనీసం పరామర్శించి, వారికి ధైర్యం చెప్పే ప్రయత్నం కూడా జరగలేదనే భావన సమాజంలో ఉంది. ఆ కుటుంబాల బాధను పంచుకోవడం, వారి పట్ల సానుభూతి వ్యక్తం చేయడం కూడా ప్రజాప్రతినిధుల నైతిక బాధ్యతే.విజయం వచ్చినప్పుడు ప్రశంసలు కురిపించడం ఎంత అవసరమో, వైఫల్యాలు ఎదురైనప్పుడు బాధ్యతను స్వీకరించడం, బాధితులకు అండగా నిలవడం కూడా అంతే అవసరం. దేశ యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో స్పందన రాజకీయాలకు అతీతంగా, మానవీయ దృక్పథంతో ఉండాలి.విద్యార్థుల నమ్మకాన్ని నిలబెట్టడం, పరీక్షల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకతను తీసుకురావడం, గతంలో జరిగిన లోపాలపై స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత.

అలాగే, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉందనే భరోసా కల్పించడం కూడా అంతే ముఖ్యమైన కర్తవ్యం.దేశ యువత కేవలం అభినందనలు మాత్రమే కాదు, కష్టకాలంలో తమతో నిలబడే నాయకత్వాన్ని కూడా ఆశిస్తోంది.

**విద్యార్థుల కన్నీళ్లను తుడిచే సమయం లేదా?**



కొప్పుల ప్రవీణ్ కుమార్ ప్రదాన కార్యదర్శి
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ

నీట్ పరీక్షల నిర్వహణపై విజయాన్ని ప్రకటిస్తూ సంబంధిత అధికారులను, మంత్రులను అభినందించడం స్వాగతించదగిన విషయమే. కానీ అదే సమయంలో, గతంలో నీట్ పరీక్షల వ్యవహారంలో ఏర్పడిన వివాదాలు, విద్యార్థులు మరియు వారి కుటుంబాలు ఎదుర్కొన్న తీవ్ర మానసిక వేదనను కూడా దేశం మరచిపోలేదు.నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటన అనంతరం తీవ్ర నిరాశకు గురైన విద్యార్థులు, వారి కుటుంబాలు ఎంతో బాధను అనుభవించాయి. ఆ విషాద పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను కనీసం పరామర్శించి, వారికి ధైర్యం చెప్పే అవకాశం దేశ ప్రధాన నాయకత్వం వినియోగించలేదనే భావన ఎంతో మందిలో ఉంది. ఇది మమ్మల్ని తీవ్రంగా కలచివేస్తోంది.దేశ ప్రధానమంత్రి దేశ ప్రజలందరికీ నాయకుడు. విజయ సమయాల్లో అభినందనలు తెలియజేయడమే కాదు, విషాద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలబడి, వారి బాధను చుకోవడం కూడా నాయకత్వంలోని ముఖ్యమైన మానవీయ కోణం.విదేశీ పర్యటనలు, అధికారిక కార్యక్రమాలకు సమయం కేటాయించినట్లే, ఇలాంటి విషాద ఘటనల్లో బాధిత కుటుంబాలను ఓదార్చడానికి కూడా సమయం కేటాయించి ఉంటే, వారికి ఎంతో మానసిక ధైర్యం లభించేదని ప్రజలు ఆశించారు.ఈ వ్యాఖ్యలు విమర్శ కోసం కాదు,  దేశ యువత, వారి తల్లిదండ్రుల మనోభావాలను ప్రతిబింబించే ఆవేదనగా ప్రభుత్వం స్వీకరించాలని కోరుతున్నాము. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉందనే నమ్మకాన్ని కల్పించడం అత్యంత అవసరం.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేయడం పేదల ఉన్నత విద్యపై దాడే..!

ఉన్నత విద్య అనేది ఏ సమాజానికైనా సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రధానమైన ఆధారం. పేదరికం అనే సంకెళ్లను తెంచుకుని కుటుంబాలను అభివృద్ధి పథంలో నడిపించే అత్యంత శక్తివంతమైన సాధనం విద్య. అయితే పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్య అందు బాటులోకి రావాలంటే ప్రభుత్వ అండ తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమలులోకి వచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం భారతదేశంలోనే అత్యంత విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలలో ఒకటిగా నిలిచింది. లక్షలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులు రూపాయి ఖర్చు లేకుండా ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ, ఇతర వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసి ఉద్యోగాలు సాధించడానికి ఈ పథకం బలమైన పునాది వేసింది. అందువల్ల ఈ పథకాన్ని ఖర్చుగా కాకుండా భవిష్యత్తు తరాలకు చేసే పెట్టుబడిగా చూడాలి.

ఈ పథకం అమలుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికి సుమారు రూ.2,500 కోట్లు మాత్రమే అవసరం. ఎస్సీ, ఎస్టీల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కేంద్ర ప్రభుత్వం కూడా నిధులు అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థుల ఫీజుల భారం మాత్రమే భరిస్తుంది. ఏటా మూడు లక్షల కోట్లకు పైగా బడ్జెట్ ప్రవేశపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి రూ.2,500 కోట్లు భరించలేని భారమా అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. ప్రతి ఏడాది ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల అప్పులు తెస్తున్నప్పుడు, పేదల విద్య కోసం మరికొన్ని వేల కోట్ల రూపాయలు సమకూర్చలేమని చెప్పడం సమంజసం కాదు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు నిర్మించడం మాత్రమే కాదు. విద్యలో పెట్టుబడి పెట్టడం ద్వారానే శాశ్వత అభివృద్ధి సాధ్యమవుతుంది.

పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మఒడి వంటి పథకాల కోసం సుమారు రూ.4 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. ఆ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ విద్యా సంక్షేమంపై వెనుకడుగు వేయడం లేదు. అలాంటప్పుడు ఆర్థికంగా బలమైన తెలంగాణ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను భారంగా చూడడం ఆశ్చర్యకరం. ఈ పథకం వల్ల కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలను ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉంది.

2008లో బీసీ ఉద్యమ నాయకుడు ఆర్. కృష్ణయ్య ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, అనేకసార్లు ప్రభుత్వంతో చర్చలు జరిపి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డిని ఒప్పించడం ద్వారా ఈ పథకం అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి దాదాపు 18 సంవత్సరాలుగా ఈ పథకం లక్షలాది మంది పేద విద్యార్థుల జీవితాలను మార్చింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కోట్లాది కుటుంబాలు ఈ పథకం ద్వారా ఆర్థికంగా, సామాజికంగా ఎదిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తే దాదాపు ప్రతి ఇంట్లోనూ ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ లేదా వృత్తి విద్యను అభ్యసించిన యువత కనిపించడం ఈ పథకం ప్రభావానికే నిదర్శనం.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్ల సమాజంలో వచ్చిన మార్పులు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు కూలి పనులకే పరిమితమైన కుటుంబాల పిల్లలు నేడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. వేలాది మంది విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు చేస్తున్నారు. వారి విజయాలతో కుటుంబాల జీవన ప్రమాణాలు మాత్రమే కాకుండా గ్రామాల ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగుపడ్డాయి. తెలంగాణలో ఐటీ రంగం విస్తరించడానికి, హైదరాబాద్ ప్రపంచ స్థాయి ఐటీ హబ్‌గా ఎదగడానికి కూడా ఈ పథకం ద్వారా తయారైన నైపుణ్యం కలిగిన మానవ వనరులే ప్రధాన బలం. ఫలితంగా రియల్ ఎస్టేట్, సేవారంగం, పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందాయి. రాష్ట్ర తలసరి ఆదాయం, స్థూల రాష్ట్రోత్పత్తి పెరగడంలో ఈ పథకం పరోక్షంగా కీలక పాత్ర పోషించింది.

నేడు నిర్మాణ రంగంలో స్థానిక యువత కంటే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ఎక్కువగా పనిచేస్తున్న దృశ్యం కనిపిస్తోంది. ఒకప్పుడు కూలి పనులు చేసిన కుటుంబాల పిల్లలు నేడు ఉన్నత విద్యతో మెరుగైన ఉద్యోగాల్లో స్థిరపడడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. ఇది ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం సాధించిన గొప్ప సామాజిక పరివర్తనకు ప్రత్యక్ష సాక్ష్యం.

అయితే కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం అమలులో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. దాదాపు రూ.10 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వ చెల్లింపులు నిలిచిపోవడంతో డిగ్రీ, జూనియర్, ప్రొఫెషనల్ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఫీజులు అందక కళాశాలల నిర్వహణ కష్టతరమవుతోంది. మరోవైపు కళాశాలలు విద్యార్థులపై ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తీసుకువస్తున్నాయి. ఫలితంగా పేద విద్యార్థులు చదువును కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతోంది.

ఇటీవల హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు కూడా ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం నిధులు విడుదల చేసే వరకు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకోవచ్చని, తర్వాత ప్రభుత్వం చెల్లించిన అనంతరం తిరిగి ఇవ్వాలని పేర్కొనడం వల్ల అనేక కళాశాలలు విద్యార్థులపై ఫీజుల ఒత్తిడి పెంచుతున్నాయి. పేద విద్యార్థులు వేలాది రూపాయలు ముందుగా చెల్లించడం సాధ్యం కాని పరిస్థితిలో ఈ తీర్పు ఉన్నత విద్యకు అడ్డంకిగా మారుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఉద్దేశమే పేద విద్యార్థులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా చదువుకునే అవకాశం కల్పించడం. అలాంటప్పుడు ముందుగా ఫీజులు చెల్లించాలనే పరిస్థితి సృష్టించడం పథకం స్ఫూర్తికే విరుద్ధం.

ఇదే సమయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం.7 కూడా అనేక సందేహాలకు తావిస్తోంది. ఈ జీఓ ప్రకారం ఫీజులు, స్కాలర్‌షిప్‌లు నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ప్రతిపాదించడం ఆచరణలో సమస్యలకు దారితీస్తుంది. విద్యార్థుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తే కళాశాలలు ముందుగా అడ్మిషన్లు ఎందుకు ఇస్తాయి? ఫీజు అందుతుందనే హామీ లేకుండా కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను చేర్చుకోవడానికి సిద్ధపడవు. ఫలితంగా పేద విద్యార్థులు అడ్మిషన్ల దశలోనే ఇబ్బందులు ఎదుర్కొంటారు. అందువల్ల ఈ జీఓను పూర్తిగా ఉపసంహరించుకుని గతంలో అమలైన విధానాన్నే కొనసాగించాలనే డిమాండ్ సమంజసంగా కనిపిస్తోంది.

ఇప్పటికే ప్రభుత్వం జారీ చేసిన పలు జీవోలు, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, యూజీసీ, ఏఐసీటీఈ ఆదేశాలు, న్యాయస్థానాల పలు తీర్పులు అడ్మిషన్ సమయంలో గానీ, కోర్సు మధ్యలో గానీ, కోర్సు పూర్తయిన తర్వాత టీసీ లేదా సర్టిఫికెట్లు ఇచ్చే సమయంలో గానీ విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని స్పష్టంగా పేర్కొన్నాయి. అయినప్పటికీ బకాయిల పేరుతో అనేక కళాశాలలు సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నాయి. పరీక్షల హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయి. ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులు అప్పులు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. మరికొందరు సర్టిఫికెట్లు అందక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారు. విదేశాల్లో ఉన్నత విద్యకు లేదా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు కూడా సర్టిఫికెట్లు అందక అవకాశాలను కోల్పోవడం అత్యంత బాధాకరం.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కేవలం సంక్షేమ పథకం మాత్రమే కాదు. ఇది సామాజిక న్యాయాన్ని బలోపేతం చేసే మహత్తర కార్యక్రమం. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు కూడా సంపన్న కుటుంబాల పిల్లలతో సమానంగా ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. విద్యా అవకాశాల్లో సమానత్వాన్ని సాధించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషించింది. దీనిని బలహీనపరచడం అంటే పేదల భవిష్యత్తును బలహీనపరచడమే.

అందువల్ల ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ విడుదల చేయాలి. హైకోర్టు తీర్పు వల్ల తలెత్తిన సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనాలి. జీఓ నెం.7ను పునఃసమీక్షించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాత విధానాన్ని కొనసాగించాలి. పేద విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చట్టపరమైన, పరిపాలనా పరమైన చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది. ఆ యువతకు ఉన్నత విద్యను అందించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేయడం కాదు, మరింత బలోపేతం చేయడమే సమాజ ప్రయోజనాలకు, రాష్ట్ర అభివృద్ధికి, సామాజిక న్యాయానికి సరైన మార్గం.




మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# కళ్ళు తెరిస్తే స్క్రీన్... మనసు తెరిస్తే శూన్యం!

ఒకప్పుడు తెల్లవారుజామున నిద్రలేవగానే మనిషి హృదయం ప్రకృతి పలకరింపుతో పులకించిపోయేది. పక్షుల కిలకిలా రావాలు, గుడి గంటల సవ్వడులు, వాకిట్లో ముగ్గు వేసే అమ్మ గాజుల గలగలలు ఇవన్నీ ఒక కొత్త రోజుకు స్వాగతం పలికే మధుర స్వరాలుగా వినవచ్చేవి. తులసి కోట ముందు వెలిగే నెయ్యి దీపం వెలుతురులో, పవిత్రమైన ఆలోచనలతో రోజు ప్రారంభమయ్యేది. ఆ జీవన శైలిలో అపారమైన సహజత్వం ఉండేది. మనసుకు ప్రశాంతతను, శరీరానికి నూతనోత్తేజాన్ని ఇచ్చే ఒక అద్భుతమైన మూల శక్తి ఆ రోజుల్లో ప్రతి ఇంటా తాండవించేది. కానీ, నేటి ఆధునిక కాలంలో తెల్లవారడం అంటే ఏమిటి?కళ్ళు తెరవగానే చేతులు సహజంగానే పక్కనున్న మొబైల్ ఫోన్ కోసం వెతుకుతాయి. నోటిఫికేషన్ల వెల్లువ, అంతులేని స్క్రోలింగ్, క్షణకాలం పాటు మెరిసిమాయమయ్యే షార్ట్ వీడియోల ప్రవాహం ,ఇవే నేటి తరం పొద్దుపొడుపు వేళ చేసే సరికొత్త సాధన . ఉదయాన్నే మనస్సుకు ప్రశాంతతను ఇవ్వడానికి బదులు, డిజిటల్ ప్రపంచపు గందరగోళాన్ని నింపుకుంటున్నాం. దీనిని మనం నాగరికత సాధించిన అద్భుతమైన అభివృద్ధా అనాలా? లేక మనిషి తనలోని సహజత్వాన్ని శాశ్వతంగా కోల్పోతున్న ఒక నిశ్శబ్ద విషాదంగా భావించాలా?ఈ సంక్లిష్టమైన ప్రశ్న నేడు మన సమాజం ముందు ఒక పెద్ద ప్రశ్నార్థకంగా నిలబడింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం ప్రగతికి చిహ్నంగా చూస్తున్నాం, కానీ ఆ పరుగులో మనలోని మానవత్వం, ప్రకృతితో ఉన్న అవినాభావ సంబంధం మన సాంస్కృతిక మూలాలు ఒక్కొక్కటిగా తెగిపోతున్నాయనే చేదు నిజాన్ని విస్మరిస్తున్నాం. నాగరికత రాకెట్ వేగంతో దూసుకుపోతుంటే, మానవీయ సహజత్వం మాత్రం వెనుకబడి మాయమవుతోంది.మన పూర్వీకులు విలాసవంతమైన భవనాలలో జీవించకపోయినా, ప్రకృతి మాత ఒడిలో పరమ సంతోషంగా బతికారు. తొలికారు నల్లటి మేఘాలను చూసి హృదయాలు ఉప్పొంగిపోయేవి. వాన చినుకులు నేలను తాకినప్పుడు వచ్చే ఆ మట్టి సువాసన మనిషి అంతరాత్మను తాకేది. పంట చేతికి వచ్చినప్పుడు ఊరంతా కలిసి పండగ చేసుకునేవారు. ఆ ధాన్యం కేవలం ఆకలి తీర్చే ఆహారం కాదు, ప్రకృతి మాత ఆశీస్సులతో లభించిన మహా ప్రసాదంగా వారు భావించేవారు. ఆ బంధంలో ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక నిస్వార్థమైన అనుబంధం దాగి ఉండేవి.కనీసం, నేటి తరం పరిస్థితి ఏమిటి? నేటి పిల్లలు పుట్టినప్పటి నుంచే కృత్రిమమైన ఎయిర్ కండిషన్డ్ గదుల మధ్య, నాలుగు గోడల సామ్రాజ్యంలో పెరుగుతున్నారు. చేతిలో స్మార్ట్‌ఫోన్ లేదా టాబ్లెట్ స్క్రీన్ మెరవకపోతే ముద్ద లోపలికి వెళ్లని దుస్థితి ఏర్పడింది. చెట్లు ఎక్కడం, ప్రకృతి అందాలను ఆస్వాదించడం అటుంచితే, కనీసం చుట్టుపక్కల ఉండే వృక్షాల పేర్లు కూడా నేటి బాల్యానికి తెలియడం లేదు. ఒకప్పుడు మట్టిలో ఆడుకోవడం శారీరక దృఢత్వానికి ప్రతీక అయితే, నేడు అది కేవలం అపరిశుభ్రత అనే ముద్రను మూటగట్టుకుంది.

ఇది కేవలం రెండు తరాల మధ్య ఉన్న ఆలోచనా విధానాల వ్యత్యాసం మాత్రమే కాదు, అంతకంటే ప్రమాదకరమైనది. మనిషికీ, మనిషిని సృష్టించిన ఆ సనాతన ప్రకృతికీ మధ్య ఏర్పడుతున్న ఒక అగాధమైన భయంకర లోయ. వ్యవసాయం అనేది మన సంస్కృతికి, నాగరికతకు ప్రాణాధారమైన పునాది. కానీ దురదృష్టవశాత్తూ, నేడు ఒక రైతు కొడుకు తన తండ్రితో కలిసి పొలానికి వెళ్ళడానికి తీవ్రంగా సిగ్గుపడుతున్నాడు. వ్యవసాయం చేయడం అనేది ఒక వెనకబడిన తనం, అనాగరికత అనే ఒక వింతైన, విపరీతమైన మానసిక రుగ్మత నేటి సమాజంలో వేగంగా బలపడుతోంది. ఇది మన సహజత్వాన్ని కోల్పోవడమే కాదు, మన ఉనికికి కారణమైన మూలాలను మనమే స్వయంగా గొడ్డలితో నరుక్కోవడమే అవుతుంది.సహజత్వం అనేది కేవలం చెట్లు, చేమలు, మట్టికి మాత్రమే పరిమితం కాదు. అది మానవ సంబంధాలలో, పరస్పర ఆప్యాయతలలో



కూడా ప్రతిబింబిస్తుంది. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో లేదా పట్టణాల్లో సైతం పక్కింటి అమ్మ పేరు, వీధి చివర ఉండే పెద్దాయన ఇల్లు, వారి కష్టసుఖాలు అందరికీ స్పష్టంగా తెలిసేవి. ఇరుగుపొరుగు అంటే కేవలం ఇళ్ళు పక్కపక్కన ఉండడం మాత్రమే కాదు, ఒకరి ఆపదలో మరొకరు తోడుగా నిలబడడం, పండుగ పబ్బాలకు కలిసి సంతోషాన్ని పంచుకోవడం, కష్టకాలంలో భుజం తట్టి ధైర్యాన్ని ఇవ్వడం.

కానీ నేటి ఆధునిక అపార్టుమెంట్ సంస్కృతిలో, పదేళ్లపాటు ఒకే అంతస్తులో పక్కపక్క ఇళ్లలో నివసిస్తున్నా ఎదురింటి వ్యక్తి పేరో, వారి వృత్తో తెలియని విచిత్రమైన పరిస్థితుల్లో మనం బతుకుతున్నాం. లిఫ్ట్‌లో ఎదురైతే కేవలం ఒక కృత్రిమమైన హాయ్ చెప్పేసి, తలదించుకుని ఫోన్లలో మునిగిపోతాం. సోషల్ మీడియా ఖాతాలలో వేల సంఖ్యలో వర్చువల్ ఫ్రెండ్స్ ఉంటారు, కానీ అర్ధరాత్రి వేళ గుండె బరువెక్కినప్పుడు ఫోన్ చేసి మనసు విప్పి మాట్లాడగలిగే ఒక్క నిజమైన మిత్రుడు కూడా కరువవుతున్నాడు. ఇది ఆధునిక నాగరికత మనకు బహుమతిగా ఇచ్చిన అత్యంత విచారకరమైన వైరుధ్యం.నేడు పెళ్లిళ్లు అనేవి పవిత్ర బంధాల నుండి మారి ఈవెంట్ మేనేజ్‌మెంట్ వ్యాపారాలుగా రూపాంతరం చెందాయి. పుట్టినరోజు వేడుకలు ఆత్మీయుల సమక్షంలో కాకుండా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలు కోసం అలంకరించబడుతున్నాయి. చివరకు మనిషి మరణం కూడా కేవలం వాట్సాప్ గ్రూపులలో ఒక నిమిషం అనౌన్స్‌మెంట్ గా మిగిలిపోతోంది. ప్రతి అనుభవాన్ని, ప్రతి క్షణాన్ని కెమెరాలో బంధించి ఫోటోగా మార్చుకోవడమే పరమావధిగా బతుకుతున్నాం. కానీ, ఆ క్షణంలో దాగి ఉన్న నిజమైన అనుభూతిని, సహజమైన ఆనందాన్ని అనుభవించడం పూర్తిగా మర్చిపోయాం. మనం మన జీవితాలను మనసారా జీవించడానికి బదులుగా, ఇతరుల మెప్పు కోసం సోషల్ మీడియా వేదికలపై కేవలం ప్రదర్శించడం మాత్రమే నేర్చుకున్నాం.గతాన్ని ఒక్కసారి పరిశీలిస్తే, మనిషి నిత్యం శారీరక శ్రమతో ముడిపడి ఉండేవాడు. ప్రతిరోజూ మైళ్ల దూరం నడవడం, పొలం పనులకు వెళ్లడం, బావుల నుండి నీళ్ళు తోడడం వంటి పనులు సహజంగానే జరిగేవి. ఆ పనులే శరీరానికి అవసరమైన వ్యాయామాన్ని, సంపూర్ణ ఆరోగ్యాన్ని చేకూర్చేవి. కానీ నేటి ఆధునిక జీవనశైలి ఎలా ఉందో చూడండి. ఇల్లు దాటితే కారు లేదా బైక్, ఆఫీసు చేరుకోగానే లిఫ్ట్, రోజంతా ఏసీ గదిలో కుర్చీకే పరిమితం కావడం, మళ్ళీ అదే వాహనంలో ఇంటికి రావడం. శరీరానికి కదలిక అవసరమనే కనీస సత్యాన్ని గ్రహించి, దాని కోసం ప్రత్యేకంగా వేల రూపాయలు వెచ్చించి జిమ్‌కు వెళ్తాం. ఇది ఎంతటి వ్యంగ్యచిత్రం! ప్రకృతి సహజంగా మనకు ప్రసాదించిన శారీరక కదలికలను నిరాకరించి, దానికి బదులుగా కృత్రిమమైన వాతావరణంలో డబ్బులు పెట్టి శ్రమను కొనుక్కుంటున్నాం.కేవలం శరీరమే కాదు, మానసిక ఆరోగ్యం కూడా నేడు తీవ్రమైన సంక్షోభంలో పడింది. ఒత్తిడి, తీవ్రమైన ఆందోళన, నిద్రలేమి వంటివి నేటి తరం యువతను పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యలుగా మారాయి. మన పూర్వీకులకు అసలు ఇలాంటి పదాల అర్థాలే తెలియవు. దానికి కారణం వారు ఎల్లప్పుడూ ప్రకృతికి అత్యంత సమీపంలో ఉండడమే. వారి పనిలో ఒక స్పష్టమైన అర్థం ఉండేది, సంబంధాలలో స్వచ్ఛమైన ఆప్యాయత ఉండేది, జీవితంలో ఒక చక్కటి లయ ఉండేది. నేడు మనకు ఆధునిక సౌకర్యాలన్నీ ఉన్నాయి, కానీ ఆ జీవన లయ మాత్రం పూర్తిగా లోపించింది. అందుకే అంత మంది మధ్య ఉన్నా మనిషి ఒంటరితనంతో, మానసిక అనాథగా కుంగిపోతున్నాడు.సోషల్ మీడియా మనల్ని ప్రపంచానికి దగ్గర చేసిందని భ్రమపడుతున్నాం, కానీ వాస్తవానికి అది పక్కనే ఉన్న మనిషి నుండి మనల్ని పూర్తిగా వేరు చేసింది. లైకులు, వ్యూలు, ఫాలోవర్ల సంఖ్య మాత్రమే మనిషి ఆత్మగౌరవాన్ని, సామర్థ్యాన్ని కొలిచే కొత్త కొలమానాలుగా మారడం దారుణం. ఈ అంతులేని డిజిటల్ పోటీలో గెలవడానికి మనిషి తన అసలైన స్వీయ రూపాన్ని వదిలేసి, ఫిల్టర్లు అద్దిన ఒక నకిలీ ముసుగును ప్రపంచానికి ప్రదర్శిస్తున్నాడు. ఇది ముమ్మాటికీ సహజత్వానికి పరిపూర్ణ వ్యతిరేకం.మన దేశానికి, సమాజానికి కాబోయే సువర్ణ భవిష్యత్తు నేటి పిల్లలే. కానీ ఆ చిన్నారులు తమ అమూల్యమైన బాల్యంలో ఏమి కోల్పోతున్నారో మనం ఎప్పుడైనా గమనించామా? మట్టిలో ఆడుకుంటూ మురిసిపోయే ఆ స్వేచ్ఛా బాల్యం నేడు మృగ్యమైపోయింది. చెట్లు ఎక్కి సాహసాలు చేయడం, వర్షం రాగానే కాగితపు పడవలు చేసి నీటిలో వదలడం, తడిసి ముద్దవడం వంటి మధురమైన ఆనందాలు నేటి తరానికి అసలు తెలియవు. గోళీలు, బొంగరాలు, దాగుడు మూతలు, అమ్మమ్మ చెప్పే చందమామ కథలు ఇవన్నీ కేవలం పాత రోజుల జ్ఞాపకాలుగా, మ్యూజియం వస్తువులుగా మిగిలిపోయాయి. యూట్యూబ్ ఛానెళ్లలో, టీవీ తెరలపై యాంత్రికంగా నటించే కార్టూన్ పాత్రలను చూస్తూ కాలం గడిపే పిల్లలకు, మైదానంలో స్నేహితులతో కలిసి ఆడే నిజమైన ఆటలోని మజా తెలియడం లేదు.దారుణమైన విషయం ఏమిటంటే, పిల్లలు తమ మనసులోని సహజమైన భావోద్వేగాలను కూడా ఎమోజీల ద్వారా మాత్రమే వ్యక్తం చేస్తున్నారు. అమితమైన బాధ కలిగినప్పుడు మనసారా ఏడవడానికి బదులుగా, ఫోన్ స్క్రీన్‌పై కేవలం ఒక ఏడుపు మొహం ఉన్న ఎమోజీని పంపిస్తూ సరిపెట్టుకుంటున్నారు. ఇది వారిని సహజమైన మానవీయ భావావేశాల నుండి పూర్తిగా వేరు చేస్తోంది. మనిషి తన ఆనందాన్ని, బాధను సహజంగా వ్యక్తపరచగలగడం ఒక గొప్ప అంతర్గత శక్తి . కానీ దురదృష్టవశాత్తూ, ఆ సహజత్వాన్ని ఒక బలహీనతగా పరిగణించే ఒక వింత సమాజాన్ని మనం నిర్మిస్తున్నాం.ఈ విశ్లేషణ అంతా కేవలం సమాజంపై నిరాశావాదాన్ని జల్లడం కోసం కాదు. ఇది మనల్ని మనం సరిదిద్దుకోవడానికి ఒక హెచ్చరిక, భవిష్యత్తు వైపు నడవడానికి ఒక పిలుపు మాత్రమే. నాగరికత నిరంతరం అభివృద్ధి చెందాలి, సాంకేతికత మన దైనందిన జీవితాలను మరింత సులభతరం చేయాలి. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ, ఆ ప్రగతి ప్రయాణం మన ప్రాణ సమానమైన సహజత్వాన్ని, మానవత్వాన్ని బలి ఇచ్చి మాత్రం సాగకూడదు.మరి దీనికి పరిష్కారం ఏమిటి? మనం చేయగలిగే చిన్న చిన్న మార్పులు చాలా ఉన్నాయి. తెల్లవారుజామున నిద్రలేవగానే మొబైల్ ఫోన్ స్క్రీన్ వంక చూడడానికి ముందు, కనీసం కొన్ని నిమిషాల పాటైనా విశాలమైన ఆకాశాన్ని, ప్రకృతిని పరిశీలించడం అలవాటు చేసుకోవాలి. వారాంతాల్లో పిల్లలను డిజిటల్ గ్యాడ్జెట్లకు దూరంగా ఉంచి, ఏదైనా పార్కుకో లేదా పల్లెటూరికో తీసుకెళ్లి మట్టిలో ఆడుకునే అవకాశం కల్పించాలి. అప్పుడప్పుడైనా పక్కింటి వారితో, స్నేహితులతో ముఖాముఖి కూర్చుని ఆప్యాయంగా మాట్లాడాలి.

ఇవి పైకి చాలా చిన్న విషయాలుగా అనిపించవచ్చు, కానీ ఇవే సమాజంలో ఒక పెద్ద సకారాత్మక మార్పుకు గట్టి నాంది పలుకుతాయి. సాంకేతికత ఎల్లప్పుడూ మన అవసరాలు తీర్చే ఒక నమ్మకమైన సేవకుడిగా మాత్రమే ఉండాలి, కానీ మనల్ని శాసించే యజమాని కాకూడదు. మనం టెక్నాలజీని ఒక సాధనంగా ఉపయోగించుకోవాలి గానీ, అది మన మానసిక ప్రశాంతతను ఉపయోగించుకునేలా వదిలేయకూడదు.ఏదైనా ఒక వృక్షం భూమిలో లోతుగా వేళ్ళు ఊనకుండా, ఆకాశమంత ఎత్తుకు ఎదగలేదు. ఒకవేళ పెరిగినా అది తాత్కాలికమే. అదే విధంగా, మనిషి కూడా తన అంతర్గత సహజత్వాన్ని, సాంస్కృతిక మూలాలను పూర్తిగా వదిలేసి సాంకేతికంగా ఎంత ఉన్నత శిఖరాలకు చేరుకున్నా ఆ ఎదుగుదల ఎప్పటికీ శాశ్వతం కాజాలదు.నేటి ఆధునిక నాగరికత సైన్స్ పరంగా ఎన్నో అద్భుతమైన మైలురాళ్లను అందుకుంది. కానీ, ఆ క్రమంలో అది గనుక తన ప్రాణప్రదమైన సహజత్వాన్ని కోల్పోతే, ఆ నాగరికత వేళ్ళు లేని ఒక బలహీనమైన చెట్టులాంటిదే అవుతుంది. అది చిన్నపాటి సంక్షోభం అనే గాలికే కుప్పకూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. కాబట్టి, మళ్లీ ప్రకృతి ఒడికి తిరిగి వెళ్ళండి. మీలో నిద్రిస్తున్న అసలైన మనిషిని, మానవత్వాన్ని మేల్కొల్పండి. ఎందుకంటే, అంతర్గత సహజత్వాన్ని కోల్పోవడం అనేది నాగరికత సాధించిన విజయం ఎంతమాత్రం కాదు .అది ముమ్మాటికీ మానవజాతి చవిచూసిన ఘోరమైన పరాజయం!



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# విశ్వబ్రాహ్మణ కులాన్నే మాయం చేసే కుట్ర

- రాజ్యాధికారంలో వాటా అడుగుతారని భయం
- అందుకే జనాభా లెక్కల్లో వేర్వేరుగా లెక్కలు
- డిమాండ్ల సాధనకు త్వరలో కార్యాచరణ
- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

**హైదరాబాద్, వెలుతురు జూన్ 27:**






విశ్వబ్రాహ్మణుల కులాన్ని మాయం చేసే కుట్రలో భాగంగానే పాలకులు కులగణనలో అయిదు వృత్తులను వేర్వేరు కులాలుగా నమోదు చేశారని ఆ సామాజిక వర్గం ప్రముఖులు, మేధావులు ఆరోపించారు. సృష్టి ఆరంభం నుంచీ మానవాళికి దిక్సూచిగా ఉన్న విశ్వకర్మల లెక్కలు తేలితే... ఎక్కడ రాజ్యాధికారంలో వాటాలు ఇవ్వాల్సి వస్తుందోనన్న భయంతోనే అగ్రకులాలు, పాలకులు కలిసి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. విభజించు-పాలించు అనే సూత్రాన్ని అమలుచేస్తూ... ఏకంగా విశ్వబ్రాహ్మణ కులాన్ని విడగొట్టి విచ్ఛిన్నం చేయడానికి ఉద్దేశపూర్వకంగానే అయిదు వృత్తులను అయిదు కులాలుగా కులగణనలో చూపించే యత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం తొలి శాసనసభాపతి, ప్రస్తుత శాసనమండలిలో ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మెట్రో ఈవినింగ్స్ పత్రిక చీఫ్ ఎడిటర్ దేవరకొండ కాళిదాస్, విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షుడు అడ్లూరి రవీంద్రాచారి, పెద్దలు దాసోజు గోవర్ధన్ చారి, కుందారం గణేశ్‌చారి, మదన్‌మోదన్, బొడ్డుపల్లి సుందర్, యాదగిరి, తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ మేరకు పలు తీర్మానాలపై చర్చ జరిగింది. డీకే పబ్లికేషన్స్ అధినేత దేవరకొండ కాళిదాస్ ప్రారంభోపన్యాసం చేస్తూ... కుట్రపూరితంగానే అయిదు వృత్తుల వారిని వేర్వేరు కులాలుగా గుర్తించి, విశ్వబ్రాహ్మణ కులాన్ని బలహీనపర్చారని పేర్కొన్నారు. విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రాచారి ముగింపు ఉపన్యాసం చేస్తూ, అన్ని జిల్లాల విశ్వకర్మ ప్రముఖులతో జులై 7న మరో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ... అధికారం, సంపద అంతా కూడా అగ్రకులాల ఆధీనం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలలో విశ్వకర్మల జనాభా అసలు లెక్కలు తేలితే... రాజ్యాధికారంలో వాటా అడుగుతారన్న భయంతోనే... అయిదు వృత్తులు చేస్తున్న విశ్వబ్రాహ్మణులను అయిదు వేర్వేరు కులాలుగా గణిస్తున్నారని తెలిపారు. నేడు ఎన్నికల ముఖచిత్రం చూస్తే... కేవలం 2-3 శాతం ఓట్ల తేడాలో ప్రభుత్వాలు తారుమారు అవుతున్నాయని చెప్పారు. అందుకే తెలంగాణలో 4-5 శాతం జనాభా ఉన్న విశ్వబ్రాహ్మణులను విభజిస్తున్నారని విమర్శించారు. కాబట్టి... విశ్వకర్మీయులే తమ కులగణనకు సర్వే నిర్వహించాలని ఆయన సూచించారు.

# గేటెడ్ కమ్యూనిటీల భద్రత బలోపేతంపై సమన్వయ సమావేశం

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 27:**

సైబరాబాద్ కమిషనరేట్, కుత్బుల్లాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) కోటిరెడ్డి కండ్లకోయలోని సిఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో, బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీల భద్రతా సంస్థల ప్రతినిధులు, సెక్యూరిటీ మేనేజర్లు సూపర్‌వైజర్లతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో గేటెడ్ కమ్యూనిటీల భద్రతను మరింత పటిష్టం చేయడం, ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థలు స్థానిక పోలీసుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, అత్యవసర పరిస్థితులు మరియు శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు వేగంగా స్పందించే విధానంపై చర్చించారు. ఈసందర్భంగా డిసిపి మాట్లాడుతూ...

గేటెడ్ కమ్యూనిటీలలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది నేరాల నివారణలో మొదటి రక్షణ కవచంగా వ్యవహరిస్తారని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా సంఘటనలు కనిపించిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్-100 కు సమాచారం అందించాలని సూచించారు. విధుల్లో నియమించే ప్రతి సెక్యూరిటీ గార్డు అర్హతలు కలిగి ఉండాలని, పూర్తి స్థాయి నేపథ్య పరిశీలన (Back-ground Verification) పూర్తయి ఉండాలని, తగిన శిక్షణ పొందిన వారినే విధుల్లో నియమించాలని ఆదేశించారు. ప్రతి గార్డు యొక్క గుర్తింపు పత్రాలు, పోలీస్ వెరిఫికేషన్, ఫోటోలు, చిరునామా వివరాలు ఉద్యోగ వివరాలను భద్రంగా నిర్వహించాలని సూచించారు. ఇటీవల చోటుచేసుకున్న కొన్ని సంఘటనల నేపథ్యంలో నేపాలీ సెక్యూరిటీ గార్డుల నియామకంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారి గుర్తింపు పత్రాలు,



చిరునామా ధృవీకరణ పత్రాలు ఇతర అవసరమైన పత్రాలను పూర్తిగా సేకరించి, సరైన ధృవీకరణ అనంతరమే విధుల్లో నియమించాలని సెక్యూరిటీ సంస్థలకు ఆదేశించారు. గేటెడ్ కమ్యూనిటీలలో సీసీటీవీ నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం, క్రమం తప్పకుండా సెక్యూరిటీ ఆడిట్లు నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం, సందర్శకుల నిర్వహణ (Visitor Management) వంటి అంశాలపై సెక్యూరిటీ సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వాలని, అవసరమైన భద్రతా రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.ఈసమావేశంలో (ఎ.సి.పి)అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, కుత్బుల్లాపూర్ డివిజన్ బాలగంగి రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ & స్టేషన్ హౌస్ ఆఫీసర్ సతీష్, బాచుపల్లి పోలీస్ స్టేషన్, ఎన్.సురేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, వివిధ ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థల ప్రతినిధులు, గేటెడ్ కమ్యూనిటీల సెక్యూరిటీ మేనేజర్లు పాల్గొన్నారు.

# ఓటును కాపాడుకోని బీజేపీకి బుద్ధి చెప్పుదాం

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 27:**

ప్రత్యేక సమగ్ర సవరణ(SIR) పేరుతో ప్రజల ఓట్లను తొలగించి వారికి అనుకూలమైన వాళ్ళను కాపాడడానికి తీసుకువచ్చిందే సర్ అని ప్రజలందరూ తమ ఓట్లను కోల్పోకుండా సర్ కార్యక్రమంలో పాల్గొని రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొని బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడ కొట్టడానికి సిద్ధం కావాలని సర్ లో అందరూ పాల్గొనాలని నినాదంతో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో శనివారం గోడ పత్రికలను షాపూర్ నగర్ అడ్డాలో ఆవిష్కరించారు.అక్రమ చొరబాటు దారు లు ఇతర దేశస్తులు మరణించిన వారి ఓట్లను తొలగిస్తున్నామని ప్రచారంతో తీసుకువచ్చిన సర్ అసలు ఉద్దేశం బిజెపికి వ్యతిరేకులైన ముస్లిం, క్రైస్తవ, దళిత, బహుజనుల ఓట్లు తొలగించడమే ప్రధాన ఉద్దేశమన్నారు.రాజ్యాంగంలో ఓటు పౌరుని హక్కు అని చెప్తే, ఓటరుగా చేర్చుకోవాల్సింది పోయి గతంలో




ఓటరైన వారినీ కూడా అనుమానాస్పదం గా ఉంచడం, పేర్లలో చిన్న చిన్న తప్పులు ఉన్నప్పటికీ పక్కన పెట్టడం లాంటివి అనేకం జరుగుతున్నాయని దీనివల్ల నష్టపోయేది ఎక్కువగా పనిచేసి బతికే కార్మికులేనన్నారు. సర్ పేరుతో బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇంటింటికి వచ్చి ఫారం లు ఎప్పుడు ఇస్తారో తెలియక వారు పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడ్డదని, దీనివల్ల ప్రజలకు ఆర్థిక భారమే కానీ ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఒకవేళ వారు ఫారంలో నింప లేకపోతే వారి ఓటు హక్కును తొలగించడం రానున్న రోజుల్లో ఓటు లేదనే కారణంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే బిజెపి యొక్క అసలు ఎజెండా అని అన్నారు. ధనవంతులు ఫారంలు సరిగ్గా నింపి ఓటు పొందితే కార్మికులు సరిగ్గా నింపలేరు కార్మికులకు ఓట్లు తొలగించి ధనవంతులకు ఓట్లుంచి మళ్లీ పూర్వం రోజుల్లో ఉన్నవాడికే ఓటు, లేని వాడికి లేనట్టు తీసుకురావడమే బిజెపి, ఆర్ఎస్ఎస్ యొక్క ప్రధాన లక్ష్యమని, ఇది తెలుసుకొని ప్రజలంతా ఓటును కాపాడుకోని రానున్న ఎన్నికల్లో అదే ఓటుతో బిజెపికి బుద్ధి చెప్పాలని కోరారు.ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, మండల కార్యదర్శి కే.స్వామి, ఏఐటిసి కార్యదర్శి బి. శ్రీనివాస్ అధ్యక్షుడు హరినాథ్ రావు ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, యువజన సంఘం నాయకులు వంశీ, కీర్తి, పార్టీ నాయకులు సుంకిరెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(SIR) కార్యక్రమాన్ని పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 27:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 293 డివిజన్ సూరారంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (SIR) ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి బూత్ లెవెల్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా అవసరమైన వివరాలను సేకరించాలని తెలిపారు. ప్రజలు బీఎల్ఓల ద్వారా అందించే ఎన్యుమరేషన్ ఫారమ్ ను సక్రమంగా నింపి సమర్పించాలని, 18సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఈకార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంతోష్, సురేందర్ రెడ్డి, రాంచందర్ రెడ్డి, శివ కుమార్, కృష్ణారెడ్డి, మౌనిక, మినాక్షి అబ్బు, సజ్జుఖాన్, లక్ష్మణ్, ప్రభకర్ రెడ్డి, నదీమ్ బూత్ లెవెల్ ఆఫీసర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆరుట్ల గ్రామంలో విఆర్ వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయం సిద్ధం అవుతుంది

**జూలై 10తేదీ రోజు అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం**

**మంచాల వెలుతురు జూన్ 27:**





మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో వీఆర్ వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణ పనులు బ్రహ్మాండంగా శరవేగంగా జరుగుతున్నాయి విఆర్ వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి దగ్గర ఉండి అయ్యప్పస్వామి దేవాలయ పనులను చేయి స్తున్నాడు ఈప్రాంతంలో ఎక్కడ లేని విధంగా ఆరుట్ల గ్రామంలోని అయ్యప్పస్వామి దేవాలయం విశాలమైనప్రదేశంలో అన్ని అంగులతో18 మెట్లతో అయ్యప్పస్వామి దేవాలయం ఎలా ఉండాలో అలా తీర్చిదిద్దుతూ అందమైన ముఖద్వారాల నిర్మాణం శబరిలో అయ్యప్ప దేవాలయం చూడగా నే ఎలా అనిపిస్తుందో అలా ఉండేలా తీర్చిదిద్దుతూ బ్రహ్మాండంగా నిర్మిస్తున్నారు అయ్యప్పస్వామి దేవాలయం పక్కనే కంఠమహేశ్వరస్వామి దేవాలయం పెద్దమ్మ దేవాలయం బీరప్ప దేవాలయం వీర బ్రహ్మంగారి దేవాలయం కాశీ విశ్వేశ్వర శివలింగం లాంటి దేవాలయాలు ఉన్నాయి అన్ని దే వాలయాలు ఒకే చోట ఉండడంతో గ్రామప్రజలు భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు దగ్గరుండి అ య్యప్పస్వామి దేవాలయం నిర్మాణం చేయిస్తున్న విఆర్ వన్ పౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి కి అయ్యప్ప భక్తులు అభినందనలు తెలుపుతు సంతోషంవ్యక్తం చేస్తున్నారు జూలై 10వ తేదీ రోజు అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుంది అయ్యప్ప భక్తులు ప్రజలు పెద్దఎత్తున హాజరై అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాలుపంచుకోవాలని అని అయ్యప్ప భక్తు లు ఒప్రకటనలో తెలిపారు.

# ఆరుట్ల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కోరే యాదయ్య


- కోరే యాదయ్య మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీనాయకులు

**మంచాల వెలుతురు జూన్ 27:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో అనారోగ్యంతో మృతిచెదిన కోరే యాదయ్య ఈవిషయం తె లుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరుట్ల గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వ ర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరే యాదయ్య నివాసానికి చేరుకొని యాదయ్య మృత దేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి ప్రాగాడ సానుభూ తి తెలిపారు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు యాదయ్య కుటుంబానికి అండగా ఉంటుంది అని అన్నారు ఈకార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు కంబాలపల్లి బుగ్గ రాములు కోరే బాబు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రావులభాష కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ మరసురేష్ మానిపాటి వెంకటేష్ యూత్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బుడిగల పరమేష్ దా సరమోని అశోక్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను పంపిణీ చేసిన మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 27:**

శనివారం గాజులరామారం సర్కిల్ పరిధిలోని రోడ మేస్త్రి డివిజన్ లో డ్వాక్రా గ్రూప్ మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని దాంట్లో భాగంగానే శనివారం చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు, రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు పరుస్తుందని మహిళలకు ఉచిత బస్సు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు మంజూరు మరియు ఇతర అనేక కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుంది అని స్థానిక డ్వాక్రా సంఘాల మహిళలలను ఉద్దేశించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో డ్వాక్రా గ్రూప్ సంఘాల మహిళలు మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు జాకీర్ బలరాం, సిహెచ్ బుచ్చిరెడ్డి, పద్మ, సలీం, రజాక్, దుర్గేష్, కల్పన, నరసింహ, ఆబేద్, లక్ష్మి, సుజాత, లావణ్య,తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు విడుదల చేయకుంటే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు

- విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదు
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**



పెండింగ్లో ఉన్న ఎనిమిది వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం సరికాదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఈ విధంగా ఇంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందో అర్థం కావడం లేదని అన్నారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఇష్టం లేదా అని ఈ సందర్భంగా ప్రశ్నిస్తున్న.పెండింగ్లో ఉన్న బకాయిలు విడుదల చేయకుంటే రాష్ట్ర ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విద్యార్థి యువత తిరగబడుతుందని అన్నారు.

# బచ్పన్ ప్లే స్కూల్ లోశప్రీ ప్రైమరీ తల్లిదండ్రుల ఓరియంటేషన్ డే

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 27:**

చింతల్ వెంకటేశ్వర నగర్ లోని బచ్పన్ ప్లే స్కూల్ లో శనివారం పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మి పూర్ణిమ ఆధ్వర్యంలో, ప్రీ ప్రైమరీ తల్లిదండ్రుల ఓరియంటేషన్ డే (పరిచయాలు మరియు వివరాల)కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె మరియు కౌన్సిలర్ శృతి పిల్లల పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన పరుస్తూ అకాడమిక్ పాఠ్యాంశాలు, పాఠ్యాంశేతర కార్యకలాపాల గురించి చర్చించారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమైనదని ప్రిన్సిపల్ తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇందులో ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండటం బాధ్యత

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 27:**



గ్రామం ఉత్తటూరు ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండడం బాధ్యత అని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఉత్తటూరు బిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు మేడిరాజు గ్రామంలో ఇంటి ఇంటికి తిరిగి ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన గొప్ప ఆయుధమని భవిష్యత్తులో మంచి నాయకులను ఎన్నుకోవటానికి ప్రతి పౌరుడు తన పేరును ఓటర్ జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్ బడి టీచర్ ఓటర్ నమోదు పక్రియ గురించి గ్రామస్తులకు వివరించారు.

# సియంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**మోత్కూర్, జూన్ 27,వెలుతురు న్యూస్ :**



మోత్కూర్ మండలం పనకబండ గ్రామంలో పోలేపల్లి మంగమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ భువనగిరిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. CMRF ఆర్థిక సహాయం కొరకు ఉపసర్పంచ్ రాధారపు మల్లేశం సహాయంతో దరఖాస్తు చేసుకోగా 26500 రూపాయల చెక్కు మంజూరు అయింది.మంజూరు అయిన చెక్కును శనివారం నాడు లబ్ధి దారులకు ఉపసర్పంచ్ రాధారపు మల్లేశం అందజేశాడు. వారి వెంట మండల ప్రధాన కార్యదర్శి పైల సతీష్,మండల నాయకులు బత్తిని సతీష్, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షులు నల్లపోగుల వెంకటేష్, కారు పోతుల శేఖర్,నిలిగొండ నరేష్, వల్లమాల మహేందర్, పోలేపల్లి అంజయ్య,నిలిగొండ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 2వ,సారి నిరుపేదలకు అన్నదానం

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 27:**



నార్కెట్‌పల్లి పట్టణంలో ప్రతిరోజూ సుమారు 100 మంది నిరుపేదలకు నిస్వార్థంగా అన్నదానం చేస్తున్న దైద నాగరాజు నిర్వహిస్తున్న "మనం స్వచ్ఛంద సంస్థ" సేవా కార్యక్రమంలో రెండోసారి పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని డాక్టర్ బయ్యా అనిల్ తెలిపారు."ఇంట్లో ఏదైనా ప్రత్యేక సందర్భం ఉండాల్సిన అవసరం లేదు. మంచి మనసు ఉంటే చాలు. ఆకలితో ఉన్న వారికి మన సహాయం తోడుగా నిలవాలి" అని ఆయన అన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ బయ్యా అనిల్ తన తల్లిదండ్రులు బయ్యా వెంకటయ్య, అలివేలు, స్నేహితులతో కలిసి నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విక్రమాచారి, గుంటూరి ఈశ్వర్ రావు, పాల శివ తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధాల పాలనతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- **ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి**

**మునుగోడు, జూన్ 27(వెలుతురు):**



రాష్ట్రంలో అరాచక, అబద్ధాల పాలన సాగుతోందని, ఎన్నికల హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి విమర్శించారు. శనివారం మునుగోడులోని మణి గార్డెన్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్–2 కార్యక్రమంలో బీజేపీ బూత్ ఏజెంట్లకు అవగాహన కల్పించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.తెలంగాణలో అమలులోకి తీసుకొచ్చిన యూరియా యాప్ రైతులకు గుదిబండగా మారిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలలో కేంద్ర ప్రభుత్వ నిధులే కీలకమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. నిరుపేదలకు అండగా నిలుస్తూ ధర్మపాలన కోసం బీజేపీ కృషి చేస్తోందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి, రాజు ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు శాగ చంద్రశేఖర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు పిన్నింటి నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పెంబళ్ళ జానయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు బలిగొనడానికి ఈ నిర్లక్ష్యమే కారణమా?

- **దారి పొడుగునా మూల మలుపులు అసలు రోడ్డు ఉందా లేదా**
- **మొన్న 'రాళ్లు'... నేడు 'మట్టి'... రేపు 'కబ్జా'..**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 27:**

అయినా కదలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు! బొత్తలబావి వద్ద మెయిన్ రోడ్డుపై భారీ బండరాళ్లు. ప్రమాదాలకు తెరలేపుతున్న ఆక్రమణలు.ఇద్దరి ప్రాణాలు బలిగొన్నా మారని పరిస్థితి. విద్యార్థుల ప్రాణాలపై పెరిగిన ఆందోళన ఫిర్యాదులపై స్పందన శూన్యం. నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న అధికారులు మొన్న "వార్త"... నేడు "మట్టి"... రేపు "కబ్జా" అంటూ వరుస కథనాలతో ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్నా, ఆర్‌అండ్‌బీ (రోడ్లు–భవనాల శాఖ), పంచాయతీరాజ్ అధికారులు మాత్రం స్పందించడం లేదని ప్రజలు మండి పడుతున్నారు.రామన్నపేట నుంచి నీర్నేముల వెళ్లే ప్రధాన రహదారిలో, బొత్తలబావి సమీపంలోని మెయిన్ రోడ్డుపై భారీ బండరాళ్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినా, మళ్లీ రహదారిని ఆక్రమిస్తూ బండరాళ్లు వేయడం ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం రహదారి పూర్తిగా ఇరుకుగా మారడంతో ఒక బస్సు ఎదురుగా వస్తే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ విద్యార్థులతో కూడిన పాఠశాల బస్సులు ఇదే మార్గంలో ప్రయాణిస్తుండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై పలుమార్లు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు.మొన్న వార్త రాశాం. నేడు మట్టి సమస్యను చూపించాం. రేపు కబ్జాలపై రాయాల్సిన పరిస్థితి వచ్చింది. అయినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం బాధాకరం.ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు వెంటనే స్పందించి రహదారిపై ఉన్న బండరాళ్లు, ఆక్రమణలను తొలగించి ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





# అభివృద్ధికి ఆమడ దూరంలో బుడిగ జంగాల కాలనీ

- **అభివృద్ధిలో కూడా వివక్షత చూపుతున్న పాలకులు.**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 27:**




ఎస్సీ కాలనీలో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలి. స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడుస్తున్న మారని దళిత బుడగ జంగాల బ్రతుకులు జిల్లా కలెక్టర్ రామన్నపేట ఎమ్మార్వో, ఎంపీడీవో గ్రామపంచాయతీ కార్యదర్శి తక్షణం మండల కేంద్రంలోని బుడిగ జంగాల కాలనీ సందర్శించాలి. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ. సిపిఎం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎస్సీ జంగాల కాలనీ లో సర్వే నిర్వహించడం ఇంటింటి తిరిగి సంతకాల సేకరణ చేయించడం జరిగింది. 20 సంవత్సరాల క్రితం నిర్మించుకున్న జంగాల కాలనీలో నేటికీ డ్రైనేజీ లేక ఇండ్ల ముందు మురికి కాలువలుగా కుంటలుగా తలపించి దోమలు, ఈగలతో అనేక రోగాల బారిన పడుతున్నామని ఇప్పటికే వర్షాలు పడతు ఉన్నాయి. డ్రైనేజీ లేకపోవడంతో వర్షపు నీళ్లు మా ఇళ్ల చుట్టే నిండి బురద మయంగా మారుతుందని అన్నారు. జంగాల కాలనీలో నీటి వసతి తో అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో రెండు బోర్ లో నీళ్లు ఉన్న చెడిపోయి సుమారు ఐదు ఆరు సంవత్సరాలుగా వస్తున్న రిపేరు చేయించిన నాధుడే లేడు కొన్ని ఇండ్లకు నీళ్లు పూర్తిగా రావు వెంటనే బోర్లను రిపేర్ చేయించి ప్రజలకు నీళ్లు అందించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పింఛను. రేషన్ కార్డులు ఇలాంటి సమస్యలు బృందం దృష్టికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కందుల హనుమంతు. సిఐటియు మండల కన్వీనర్ గొరిగ సోములు. సిపిఎం మండల కమిటీ సభ్యులు బావండ్ల పెల్లి బాలరాజు,గాదె నరేందర్. సంఘం అధ్యక్షులు మేడి ముకుందం.టౌన్ కార్యదర్శి మునుకుంట్ల లెనిన్. నాయకులు పల్లె సత్యం, కుందూరు వెంకటేశం, వెంకట్ రెడ్డి, గంజి అశోక్, సల్ల రాజు,విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల అనుమతులు రద్దు చెయ్యాలి

**ప్రతీ ప్రైవేట్ పాఠశాల సొంతంగా ఏర్పాటు చేసుకున్న నోట్ బుక్స్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలి**

**తెలంగాణ వినియోగదారుల సంఘాల కార్యదర్శి పోచం సోమయ్య.**

**మోత్కూర్, జూన్ 27,వెలుతురు న్యూస్ :**

అధిక ఫీజులు వసూలు చేస్తున్న శ్రీ చైతన్య పాఠశాల మరియు ఇతర పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని శనివారంమోత్కూరు మండల విద్యాధికారి తంగళ్ళపల్లి సత్యనారాయణకు తెలంగాణ వినియోగదారుల సంఘాల కార్యదర్శి పోచం సోమయ్య వినతి పత్రం అందజేశారు అనంతరం అధికారితో మాట్లాడుతూ పాఠశాలల యజమాన్యం అధిక ఫీజులు తీసుకుంటూ ఖచ్చితమైన ఫీజులు నిర్ణయించకుండా ఒకే తరగతికి వేరువేరు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు గతంలో పలుమార్లు ఖచ్చితమైన ఫీజుల పట్టిక ప్రదర్శించాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరినా ఇప్పటివరకు ఫీజుల వివరాలు పాఠశాల యాజమాన్యం తెలుపలేదని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల లో నోటుబుక్స్ అమ్మ వద్దని ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రతి ప్రైవేటు పాఠశాల సొంతంగా పుస్తక విక్రయశాలలను ఎటువంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేసుకొని అధిక ధరలకు పుస్తకాలు విద్యార్థులకు విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నారు . శ్రీ చైతన్య పాఠశాలలో 8వ తరగతి విద్యార్థికి నోట్ బుక్స్ 10,600 రూపాయల ధర నిర్ణయించి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని తెలిపారు.



మరియు అదనంగా ప్రాజెక్టుల పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేయడం జరుగుతుందని అధికారి దృష్టికి తీసుకుపోగా అధికారి స్పందించి వెంటనే పాఠశాలల పై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన పేరెంట్స్ ఎలగందుల అమరేందర్, పెండెం నరహరి, పసునూరి సురేష్ తదితరులు ఉన్నారు.

# పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో విజయోత్సవ సభ



- **అంబుజా సిమెంట్ కంపెనీ రద్దు.. ప్రజా విజయం**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 27:**

ఈనెల 29న విజయోత్సవ సభ. మండల కేంద్రంలోని రహదారి బంగ్లా ఆవరణలో పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు రద్దును పురస్కరించుకొని విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు వేదిక కన్వీనర్ జల్లెల పెంటయ్య, కో కన్వీనర్ మహమ్మద్ రెహన్ సభ్యులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రహదారి బంగ్లాలో వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నపేట లో పర్యావరణానికి, ప్రజలకు హాని కలిగించే ప్రతిపాదిత అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు చెయ్యడం లేదంటూ ఆ ప్రతిపాదనను విరమించుకున్నామని కంపెనీ వర్గాలు ప్రకటించడం ప్రజల పోరాట విజయం అని వారన్నారు. సిమెంట్ కంపెనీ రద్దు కావాలని, మా ప్రాంతంలో ఏర్పాటును అంగీకరించమని మండల వ్యాప్తంగా అశేషమైన ప్రజానీకం, అఖిలపక్షాలు, వివిధ వృత్తిదారులు, విద్య, యువజన, స్వచ్ఛంద సేవ సంస్థలు, విశ్రాంత ఉద్యోగులు సబ్బండ వర్గాలు ఉద్యమించి తిప్పి కొట్టాయని వారన్నారు. ఈ ఉద్యమ స్ఫూర్తిని మననం చేసుకోవడం కోసం, ప్రజలను అఖిలపక్షాలను అభినందించడంతోపాటు విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని, సబ్బండ వర్గాలు తరలివచ్చి విజయోత్సవ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ విజయోత్సవ సభకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, వివిధ పార్టీల నాయకులు హాజరుకానున్నారని వారు తెలిపారు. ఈ సమావేశంలో సభ్యులు ఊట్కూరు నరసింహ, ఎండి జమీరోద్దీన్, కందుల హనుమంతు, ఫజల్ బేగ్, నోముల చిరంజీవి, రాజు, బత్తుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 27:**

మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, రామన్నపేట ఆధ్వర్యంలో ఈరోజు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, రామన్నపేటలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ విలువలు, పౌరుల ప్రాథమిక విధులు, బాలల హక్కులు మరియు బాల కార్మిక వ్యవస్థ నివారణ, బాలలపై జరిగే దుర్వినియోగాల నివారణ, పోక్సో ( పి ఓ సి ఎస్ ఓ) చట్టంపై అవగాహన, సేఫ్ టచ్ – అన్‌సేఫ్ టచ్, సైబర్ భద్రతతో పాటు ఇతర ముఖ్యమైన న్యాయ అంశాలపై విద్యార్థులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకొని, తమ హక్కులు మరియు విధులను తెలుసుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఎస్. శిరీష సూచించారు. అలాగే ఏవైనా న్యాయ సంబంధిత సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా మరియు మండల లీగల్ సర్వీసెస్ సంస్థలు అందించే ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానెల్ అడ్వకేట్ కూనూరు శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆరుట్ల గ్రామంలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న యువతికి మొబైల్ పోలీస్ స్టేషన్ లో సీఐ చేతులు మీదు గా ఇచ్చి మానవత్వం చాటుకున్న ప్రజాగళం దామెర భూపాల్

- **తనకు దొరికినమొబైల్ తిరిగిచ్చి మానవత్వం చాటుకున్న ప్రజాగళం భూపాల్ ను అభినందించిన సీఐ మధు**

**మంచాల వెలుతురు జూన్ 27:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో చౌటుప్పల్ మండలం తంగడపల్లి గ్రామానికి చెందిన యు వతి ఆరుట్ల గ్రామంలో ఉదయం తన మొబైల్ పోగొట్టుకుంది ప్రజాగళం దామెర భూపాల్ రోడ్డు పై న నడుచుకుంటూ వెళుతుండగా మొబైల్ తనకంటపడింది వెంటనే మొబైల్ చేతిలో పట్టుకొని దొ రికిన మొబైల్ గురించి ఆరుట్ల గ్రూపులో పెట్టడం జరిగింది ఎవ్వరు స్పందించకపోవడంతో ఫోన్ లా క్ ఉండడంతో వెంటనే మంచాల పోలీస్ స్టేషన్ కు వెళ్లి సిఐ గారికి అంద జేశారు వెంటనే స్పందించిన సీఐ మ ధు కాల్ డేటా ద్వారా తంగడిపల్లి గ్రామానికి చెందిన వాళ్ళది అని వెంటనే తంగడిపల్లి గ్రామానికి సమాచారం ఇవ్వడంతో వెంటనే మొబైల్ పోగొట్టుకున్న యువతి పోలీస్ స్టేషన్ రా వడం జరిగింది తన మొబైల్ ఫోన్ సిఐ మధు ప్రజాగలం భూపాల్ యువతీకి ఫోన్ అందజేశారుదొ రికిన మొబైల్ ఫోన్ ఇచ్చి మానవత్వం చాటుకున్న ప్రజాగళం దామెర భూపాల్ నుసీఐ మధు అభి నందించారు.

# నల్ల పోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

- **విట్టల్‌వాడిలో శ్రీ నల్ల పోచమ్మ ఆలయం 19వ వార్షికోత్సవ వేడుకలు**
- **ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధల మధ్య వార్షికోత్సవ వేడుకలు**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**

హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలోని విట్టల్‌వాడిలో ఉన్న శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవాలయం 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి మహాలక్ష్మి రామన్ గౌడ్ అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో విట్టల్‌వాడి బస్తీవాసులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారగా, వార్షికోత్సవ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి.



# సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడిగా కోణం విఠల్

**వెలుతురు నారాయణఖేడ్ జూన్ 27 :**



మెదక్ జిల్లా :- పెద్ద శంకరంపేట్.. భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షుడిగా పెద్ద శంకరంపేట మండల పరిధిలోని టింకటి గ్రామానికి చెందిన కోణం విఠల్ నియామకం అయ్యారు. శనివారం నూతనంగా నూతనంగా సంగారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన కోణం విఠల్ మెదక్ ఎంపీ రఘునందన్ రావు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి. సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. జిల్లాలో భారతీయ జనతా పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఓబిసి జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామ్ చందర్ రావు.. రాష్ట్ర ఓబిసి అధ్యక్షుడు ఆనంద్ గౌడ్... నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. బి జె వై ఎమ్ అధ్యక్షుడు బుగుడాల కృష్ణ.. మంగళ కృష్ణ పత్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాం - నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూన్ 27:**

రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి, రోడ్లపైకి వర్షపు నీరు చేరకుండా ఉండేందుకు అధికారులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.డ్రైనేజీల పూడికతీత పనులను పరిశీలించిన సందర్భంగా సిల్ట్ కంటే భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతున్నాయని మేయర్ ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ఇంటింటికీ 'స్వచ్ఛ ఆటోలు' ద్వారా చెత్త సేకరణ జరుగుతున్నప్పటికీ, కొందరు నిర్లక్ష్యంగా ప్లాస్టిక్ కవర్లు, చెత్తను డ్రైనేజీల్లో వేయడం వల్ల మురుగునీటి ప్రవాహానికి



ఆటంకం ఏర్పడి నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హానికరమని, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. అందువల్ల నగర ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, "ప్లాస్టిక్ రహిత కరీంనగర్" లక్ష్య సాధనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.చెత్త సేకరణలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే స్థానిక కార్పొరేటర్ల దృష్టికి తీసుకువస్తే వెంటనే స్వచ్ఛ ఆటోలను పంపించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. నగర పరిశుభ్రతను కాపాడేందుకు రోడ్లపై, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేదా ఇతర చెత్తను వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని నగర ప్రజలకు మేయర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారితో పాటు స్థానిక కార్పొరేటర్ బండారి వేణు, మాజీ కార్పొరేటర్ జితేందర్, సాదవేని శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అభిప్రాయంతోనే రోడ్డు విస్తరణ చేపట్టాలి

- **ఎంఐఎం అధ్యక్షుడు న్యాయవాది మొహీద్ పటేల్**

**వెలుతురు నారాయణఖేడ్ జూన్ 27 :**




సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతిపాదిత రెండు వైపులా 50 అడుగుల రోడ్డు విస్తరణను ప్రజల అభిప్రాయం మేరకే చేపట్టాలని ఎంఐఎం నారాయణఖేడ్ అధ్యక్షుడు, న్యాయవాది మొహీద్ పటేల్ డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణ వల్ల నష్టపోయే ప్రజలు పరిష్కారం కోసం ఎంపీ, ఎమ్మెల్యేలను ఆశ్రయిస్తే, సమస్యను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టివేస్తున్నారని ఆయన విమర్శించారు. ఏళ్ల తరబడి బైపాస్ రోడ్డును నిర్లక్ష్యం చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రెండు వైపులా 50 అడుగుల రోడ్డు విస్తరణ పేరుతో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టిస్తూ, ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రత్యామ్నాయంగా బైపాస్ రోడ్డును అభివృద్ధి చేస్తే నారాయణఖేడ్ చౌరస్తాలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని, అలాగే నిజాంపేట్–నారాయణఖేడ్–బీదర్ జాతీయ రహదారి (NH–161B) పూర్తయిన తర్వాత పట్టణంలో ట్రాఫిక్ సమస్య దాదాపు ఉండదని ఆయన పేర్కొన్నారు.ఈ అంశాన్ని త్వరలోనే ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని మొహీద్ పటేల్ వెల్లడించారు.

# ఖేత్ బచావో అభియాన్‌లో రైతులకు స్థిరమైన పోషక నిర్వహణపై అవగాహన

- **భూసార పరీక్షలు, వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులపై డి.డి.ఎస్.**
- **- కె.వి.కె. శిక్షణ కార్యక్రమం....**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 27:**

ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా డి.డి.ఎస్.–కె.వి.కె. ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా రైకోడ్ మండలంలోని సిరూర్, మహబత్‌పూర్ గ్రామాల్లో రైతులకు స్థిరమైన పోషక నిర్వహణ, వాతావరణ మార్పులకు తట్టుకునే వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా భూసార శాస్త్ర నిపుణులు ఈ. స్వామి మాట్లాడుతూ, పంట సాగుకు ముందు భూసార పరీక్షలు చేయించడం ద్వారా ఎరువులను సమతుల్యంగా వినియోగించి అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించవచ్చని తెలిపారు. భూసార ఆరోగ్య కార్డులను ఎలా ఉపయోగించుకోవాలో వివరించి, పత్తి, సోయాబీన్, కందుల పంటలకు అవసరమైన ఎరువుల సిఫార్సులను రైతులకు తెలియజేశారు.అలాగే నేల తేమ సంరక్షణ, పంటల మార్పిడి, అంతర పంటల సాగు, సీడ్ బాల్ పద్ధతులు, వాతావరణ అనుకూల పంట ప్రణాళికలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఏఈఓ సంగమేశ్వర్ ప్రభుత్వ పథకాలు, రైతు నమోదు ప్రక్రియ, సంక్షేమ కార్యక్రమాలపై వివరించారు.కార్యక్రమం ముగింపులో రైతులతో పరస్పర చర్చ నిర్వహించి, రాబోయే సాగు సీజన్‌కు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సూచనలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారుతి, మహిళా రైతులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, డి.డి.ఎస్.–కె.వి.కె. సిబ్బంది పాల్గొన్నారు.



# జహీరాబాద్‌లో హజ్రత్ సయ్యద్ బుర్హాన్ అలీ షా తకియాలో ఘనంగా మొహర్రం వేడుకలు

**జహీరాబాద్ వెలుతురు జూన్ 27:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని హజ్రత్ సయ్యద్ బుర్హాన్ అలీ షా తకియాలో మొహర్రం సందర్భంగా ఐదవ తేదీ నుంచి పన్నెండవ ఇమామ్ చాంద్ పీర్ల ఉస్తాదగీ మతపరమైన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా 11వ మొహర్రం సందర్భంగా భారీ జాతర, ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా జహీరాబాద్‌కు చెందిన పురాతన ఆలమ్‌లు హజ్రత్ జుల్ఫికార్ అలీ (అ.స) మరియు హజ్రత్ హుస్సేని బాద్షా (అ.స) తకియాకు చేరుకుని ప్రత్యేక మతపరమైన ఆచారాలు నిర్వహించబడ్డాయి.ఇషా నమాజ్ అనంతరం దర్గా సజ్జాదా నషీన్, ముతవల్లి సయ్యద్ ఇక్బాల్ షా ఆధ్వర్యంలో, సయ్యద్ జమీరుద్దీన్ షా పర్యవేక్షణలో ఆలమ్‌ల సవారీ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి, అనంతరం వాటిని ఆయా స్థానాలకు పంపించారు. జహీరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ఫాతేహా నిర్వహించి తబర్రుక్ స్వీకరించారు. కార్యక్రమంలో సయ్యద్ ముంతాజ్ షా, సయ్యద్ సాదిక్ అలీ షా, సయ్యద్ ఫర్దీన్ షా, సయ్యద్ ఫహద్ షా తదితరులు పాల్గొన్నారు.

# 48వ డివిజన్‌లో రూ.20 లక్షలతో డ్రైన్, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూన్ 27:**



కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నగరంలోని 48వ డివిజన్ కురుమవాడ ప్రభుత్వ పాఠశాల సమీపంలో రూ.20 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న పైప్ లైన్ డ్రైన్ మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ ★కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నగరపాలక సంస్థ లక్ష్యమని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని అన్నారు. చేపట్టిన పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు గారు, 48వ డివిజన్ కార్పొరేటర్ కర్రె పద్మ అనిల్★ గారు, కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మీ ప్రకాష్ గారు, బండ రమణా రెడ్డి గారు, గాజ రమా శివరామ్ గారు, పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్ గారు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

# 27వ డివిజన్ శివాజీ నగర్‌లో రూ.12 లక్షలతో డ్రైన్ పైప్‌లైన్, సీసీ ప్యాచ్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**కరీంనగర్ వెలుతురు జూన్ 27:**



కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 27వ డివిజన్ శివాజీ నగర్ ప్రాంతంలో రూ.12 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న డ్రైన్ పైప్‌లైన్ మరియు సీసీ ప్యాచ్ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే నగర పాలక సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతూ ప్రతి డివిజన్‌ను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి గారు, 12వ డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల కిరణ్ కుమార్ గారు, కార్పొరేటర్ నూనావత్ భాస్కర్ నాయక్ గారు, కర్ర అనిల్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం నీడలో ప్రజాప్రయోజన పార్కులు.. కోట్ల ప్రజాధనం వృథా



- **జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి. రాములు...**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 27:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో ప్రజల ఆరోగ్యం, వినోదం కోసం కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసిన పార్కులు ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యంతో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయి వినియోగానికి పనికిరాని స్థితికి చేరాయని జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి. రాములు విమర్శించారు. ముఖ్యంగా ఐడీఎస్ఎండి కాలనీలోని పార్కు నాలుగేళ్ల క్రితం లక్షల రూపాయలతో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చినా, కేవలం ఆరు నెలలకే పర్యవేక్షణ లేక నిరుపయోగంగా మారిందన్నారు.పార్కులో పందులు, వీధి కుక్కలు, పశువులు సంచరిస్తూ కంచెను ధ్వంసం చేశాయని, పిచ్చిమొక్కలు పెరిగి చిన్న అడవిని తలపించేలా మారిందని తెలిపారు. పార్కులు అందుబాటులో లేకపోవడంతో వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు, గర్భిణీలు ఉదయం నడక కోసం రోడ్లపైకి రావాల్సి వస్తోందని, దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కావున జహీరాబాద్ మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పట్టణంలోని పార్కులను పునరుద్ధరించి ప్రజలకు సౌకర్యవంతంగా అందుబాటులోకి తీసుకురావాలని జహీరాబాద్ పట్టణ ప్రజల తరఫున పి. రాములు డిమాండ్ చేశారు.

# చొప్పదండి గురుకుల పాఠశాలలో ఇంటర్ సైన్స్ వింగ్ అడ్మిషన్లు పున:ప్రారంభించాలి

- **బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి**

**చొప్పదండి వెలుతురు జూన్ 27:**



చొప్పదండి పట్టణ సమీపం లోని కొలిమికుంట గురుకుల పాఠశాలలో హాస్టల్ వసతి లేదనే కారణం తో నిలుపుదల చేసిన ఎంపీసీ బైపీసీ సెక్షన్లలో అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని ఎంపీటీసీ ఫోరం మాజీ మండల అధ్యక్షులు, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.క్రితం సంవత్సరం కూడా హాస్టల్ వసతి లేదని అడ్మిషన్లు తీసుకోలేదని సంవత్సరం గడిచినప్పటికి వసతి ఏర్పాటు చేయడం పై కానీ నూతన అడ్మిషన్ల పై కానీ దృష్టి సారించిన నాధుడు లేదని ఆయన వాపోయారు.పాలకుల నిరక్షం వలన 160 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం కోల్పోయారని కరీంనగర్ జిల్లా కలెక్టర్ సత్వరం స్పందించి గురుకుల పాఠశాల లో ఇంటర్ సైన్స్ విభాగం అడ్మిషన్లు ప్రారంభించ చేయాలని సింగిరెడ్డి కృష్ణారెడ్డి, బీజేపీ మండల శాఖ అధ్యక్షులు మొగిలి మహేష్, దొంతిసారపు సంపత్ లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న కాట సుధా



**బీరంగూడ వెలుతురు జూన్ 27:**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతి నగర్ కాలనీలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది.ఈ మహోత్సవంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

# పూర్వ జిల్లా విద్యాధికారి, ప్రస్తుత డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాధా కిషన్ గారి పదవి విరమణ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించిన తపస్ మెదక్ జిల్లా శాఖ

**హవెలి ఘనపూర్ వెలుతురు జూన్ 27:**



మెదక్ జిల్లా పూర్వ విద్యాశాఖాధికారి,ప్రస్తుత మెదక్ డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్.శ్రీ ధనాలకోట రాధకిషన్ గారి పదవీ విరమణ కార్యక్రమం హవెలి ఘనపూర్ మండలంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జరిగింది.ఈ సందర్భంగా తపస్ మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాల సిద్దు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్,జిల్లా ఉపాధ్యక్షులు మాధవరెడ్డి,జిల్లా బాధ్యులు అల్లం సతీష్ కుమార్,మెదక్ మండల అధ్యక్షులు మెరుగు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# యోగ కు సమయం కేటాయించాలి: చంద్రారెడ్డి

**కూకట్ పల్లి జూన్ 27 వెలుతురు:**

ఉరుకుల పరుగుల యాంత్రిక జీవితంలో యోగా కు కొంత సమయం కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. బస్తీలోని శ్రీశ్రీశ్రీ వీరంజనేయ శివాలయం కమిటీ హాల్లో శనివారం నుంచి యోగ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఉదయం 5.30 నిమిషాల నుంచి 7.00 గంటల వరకు ఉచిత యోగ శిక్షణ ఉంటుందని చంద్రారెడ్డి తెలిపారు. యోగ గురువు సుదేర్షన్, నరసింహులు, తాటి కిరణ్, తిరుపతి రెడ్డి, వనం అంజనేయులు, పి శంకర్ రెడ్డి, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ పై అప్రమత్తంగా లేకపోతే నష్టపోతాం

- తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, సర్ పార్లమెంట్ కంట్రోల్ రూమ్ మహబూబాబాద్ కోఆర్డినేటర్ నూతి శ్రీకాంత్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**

ఎస్ ఐ ఆర్ ( ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ) పై అప్రమత్తంగా లేకపోతే నష్టాన్ని మూటకట్టుకోవాల్సి వస్తుందని, తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, సర్ పార్లమెంట్ కంట్రోల్ రూమ్ మహబూబాబాద్ కోఆర్డినేటర్, నూతి శ్రీకాంత్ గౌడ్ హెచ్చరించారు.శనివారం నాడు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ పై అప్రమత్తంగా ఉండాలని ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన నష్టం జరగడం ఖాయమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో విశ్వాసంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ పిసిసి చీఫ్ మహేష్ గౌడ్, తనను సర్ పార్లమెంట్ కంట్రోల్ రూమ్ మహబూబాబాద్ కోఆర్డినేటర్ గా నియమించినందుకు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియ పై పార్టీ నేతలు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐఆర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐఆర్ పేరుతో రాష్ట్రంలో ఉన్న మొత్తం ఓట్లలో మెజార్టీ శాతం ఓట్లను ఏదో ఒక కారణంతో పక్కన పెడతారని సందేహాన్ని వ్యక్తం చేశారు. అనుమానాస్పదం పేరుతో వాటిని తొలగించే ప్రయత్నం జరుగుతుందని అదే జరిగితే రాజకీయంగా



అత్యంత ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొనవలసి వస్తుందని హెచ్చరించారు. 119 అసెంబ్లీ నియోజకవర్గాలలోని ప్రతి గ్రామంలో ప్రతి బూత్ లో బూత్ లెవెల్ ఆఫీసర్లతో అనుసంధానం కావాలని సూచించారు. ముఖ్యంగా వలసలు వెళ్లిన వారి విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్నికల అధికారులు ఇళ్ళకు వెళ్ళినప్పుడు వారు లేకపోవచ్చు అని అప్పుడు వారిని ఓట్లు తీసివేసే ప్రమాదం ఉందని అలాంటి ఓట్లను కూడా తొలగించకుండా పార్టీ నాయకత్వం జాగ్రత్తలు తీసుకోవాలని కార్యకర్తలు ఈరోజు నుండి క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ఓట్లు తొలగించకుండా నిజమైన ఓటర్ ఓటు హక్కు కలిగే విధంగా చూసుకోవాలని సూచించారు.

### ఒక్క ఓటు పోకుండా చూడాలి.

బూత్ లెవెల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించకపోతే పెద్ద ఎత్తున ఓట్లను కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ఓట్ల జాబితాలో చోటు చేసుకున్న లోపాలు తప్పులతో కూడిన అనామలిస్, జాబితాలోని ఓటర్ల విషయంలో క్షేత్రస్థాయి బూతులో ఏజెంట్లు జాగ్రత్తగా వ్యవహరించాలని అర్హులైన ఏ ఒక్కరి ఓటు జాబితా నుండి తొలగించకుండా చూడాల్సిన బాధ్యత మనదే అని అన్నారు. ఈ పరిశీలన ప్రక్రియలో ఓటర్లకు ఎదురవుతున్న ఇబ్బందులను గమనించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ మ్యాపింగ్ తో పాటు సందేహాస్పద ఓట్లను కూడా నిశితంగా గమనించాలని కేవలం ఒక వర్గానికి చెందిన ఓట్లు కాంగ్రెస్ అనుకూలం ఓట్లను మాత్రమే ఎస్ఐఆర్ లోభాగంగా తొలగిస్తారని అనుమానం కలుగుతుందని గతంలో భావించే వారమని కానీ ఏఐ సహాయంతో సోషల్ మీడియా అధ్యయనం ఓట్లు పోకుండా జాగ్రత్త పడాలని కోరారు.

### సర్ ఉద్దేశం ఏమిటంటే?

ఇది ఓటర్లు రాజకీయ పార్టీలు ఎన్నికల అధికారులందరి భాగస్వామ్యంతో నిర్వహించే కార్యక్రమం అని చనిపోయిన వారు డూప్లికేట్ శాశ్వతంగా తరలిపోయిన వారు అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించి అర్హుల పేర్లను మాత్రమే చేర్చే ప్రత్యేక కార్యక్రమం అని బూత్ లెవెల్ ( బి ఎల్ ఓ )అధికారులు ఇంటింటికి వెళ్లి ఓట్లను పరిశీలిస్తారని ఓటర్ల భర్తీ చేసిన ఎన్యూ మరేటర్న్ ఫారాలను పాత ఓటర్ డాటా తో సరిపోలుస్తారని 1951 నుంచి 2004 మధ్యకాలంలో 8సార్లు ఇలాంటి కసరత్తు చేపట్టారని నూతి శ్రీకాంత్ గౌడ్ గుర్తు చేశారు.

# 'గోల్డ్ మ్యాన్' సూర్య భాయ్ అరెస్ట్

- షాద్‌నగర్‌లో పట్టుకున్న పోలీసులు
- తక్కువ ధరకే బంగారం పేరుతో మోసం
- రూ.30 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు
- బంగారం ఇవ్వకుండా బాధితులకు టోకరా
- ఐఫోన్లు, చెక్ ఇచ్చి పంపించిన నిందితుడు
- బాధితులపైనే కేసు పెట్టిన సూర్య భాయ్
- దర్యాప్తులో వెలుగులోకి అసలు నిజం
- నారాయణగూడ పోలీసులకు కేసు బదిలీ
- పరారీలో ఉండగా అదుపులోకి గోల్డ్ మ్యాన్‌ను విచారిస్తున్న పోలీసులు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**

తక్కువ ధరకే విదేశీ బంగారం ఇప్పిస్తానంటూ అమాయకులను మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 'గోల్డ్ మ్యాన్' సూర్య భాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నుంచి పరారై షాద్‌నగర్‌కు వెళ్తుండగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని విచారిస్తూ మోసానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. తక్కువ ధరకే విదేశీ బంగారం అందిస్తానంటూ సూర్య భాయ్ పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. అతడి మాటలు నమ్మిన హిమాయత్‌నగర్, నీలోఫర్ ప్రాంతాలకు




చెందిన బాధితులు కలిపి సుమారు రూ.30 లక్షలు చెల్లించినట్లు తెలుస్తోంది. అయితే డబ్బులు తీసుకున్న తర్వాత కూడా బంగారం ఇవ్వకపోవడంతో బాధితులు సూర్య భాయ్ ఇంటికి వెళ్లి తమ సొమ్ము తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.దీంతో తన వద్ద ఉన్న మూడు ఐఫోన్లను బాధితులకు ఇచ్చిన సూర్య భాయ్, వాటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని చెప్పాడు. అలాగే మిగిలిన రూ.20 లక్షలకు చెక్ ఇచ్చి వారిని పంపించినట్లు సమాచారం. అయితే అనంతరం బాధితులపైనే తిరిగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనను బెదిరించి ఐఫోన్లు లాక్కెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.ఈ వ్యవహారంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా అసలు మోసం వెలుగులోకి వచ్చింది. తక్కువ ధరకే బంగారం పేరుతో డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు సూర్య భాయ్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం కేసును తదుపరి దర్యాప్తు కోసం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.కేసు నమోదు అయిన విషయం తెలుసుకున్న సూర్య భాయ్ హైదరాబాద్ నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించాడు. షాద్‌నగర్ వైపు వెళ్తుండగా పోలీసులు అతడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని విచారిస్తూ మరిన్ని బాధితులు ఉన్నారా? ఎంత మొత్తంలో మోసం జరిగింది? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# మహారాష్ట్ర టెట్ ప్రశ్నపత్రం లీక్ కలకలం

- పరీక్షకు ముందే బయటకు వచ్చిన ప్రశ్నపత్రం ఆదివారం టెట్ పరీక్ష వాయిదా
- థాణెలో అభ్యర్థులకు పేపర్ చేరినట్లు ఆరోపణలు
- భీవండిలో సోదాలతో వెలుగులోకి ఘటన
- అసలు ప్రశ్నపత్రమా? మాక్ టెస్టా? దర్యాప్తు
- పోలీసుల కేసు నమోదు
- విద్యాశాఖ విచారణ ముమ్మరం
- గత ఏడాది టెట్ పేపర్‌తో పోలికలు
- ప్రాథమిక విచారణ తర్వాత తదుపరి చర్యలు
- పరీక్షల భద్రతపై మరోసారి ఆందోళన

**మహారాష్ట్ర వెలుతురు జూన్ 27:**

నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం కొనసాగుతున్న వేళ మహారాష్ట్రలో మరో పరీక్షా పత్రం లీక్ ఘటన వెలుగులోకి రావడం కలకలం రేపింది. మహారాష్ట్ర టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ప్రశ్నపత్రం లీక్ అయినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆదివారం నిర్వహించాల్సిన టెట్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్ (MSCE) ప్రకటించింది.థాణె జిల్లాలోని పలువురు అభ్యర్థులకు పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలు ముందుగానే చేరినట్లు సమాచారం అందడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ ఆరోపణలను అత్యంత తీవ్రంగా పరిగణించిన పరీక్షల మండలి, పరీక్ష నిర్వహణను తాత్కాలికంగా నిలిపివేసి వాయిదా వేయాలని నిర్ణయించింది.అయితే అనుమానితుల వద్ద స్వాధీనం చేసుకున్న మెటీరియల్ అసలైన టెట్ ప్రశ్నపత్రమేనా? లేక మాక్ టెస్ట్ కోసం రూపొందించిన నమూనా ప్రశ్నపత్రమా? అనే అంశంపై విద్యాశాఖ అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణ పూర్తైన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.మరోవైపు, పరీక్షకు ముందే ప్రశ్నపత్రం ఎలా బయటకు వచ్చిందనే అంశంపై కూడా ప్రత్యేకంగా విచారణ కొనసాగుతోంది. భీవండి ప్రాంతంలో టెట్ ప్రశ్నపత్రం లీక్ అయినట్లు అందిన రహస్య సమాచారం ఆధారంగా పోలీసులు పలుచోట్ల సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో లభించిన ఆధారాల ద్వారా పేపర్ లీక్ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్ వెల్లడించింది.ప్రా



థమిక దర్యాప్తులో అనుమానితుల వద్ద లభించిన ప్రశ్నపత్రంలోని ప్రశ్నలు గత ఏడాది టెట్ పరీక్ష కోసం సిద్ధం చేసిన ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలతో సరిపోలినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఈ వ్యవహారంపై భీవండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పరీక్షల గోప్యత, భద్రతపై వరుసగా ప్రశ్నలు తలెత్తుతున్న నేపథ్యంలో ఈ ఘటన ప్రాధాన్యత సంతరించుకుంది. అసలు ప్రశ్నపత్రం ఎలా బయటకు వచ్చింది? లీక్‌కు ఎవరు బాధ్యులు? ఇందులో మరెవరెవరికి సంబంధం ఉంది? వంటి అంశాలపై అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పరీక్షల మండలి స్పష్టం చేసింది.

# కేతన్ హత్య కేసులో షాకింగ్ ట్విస్ట్

- పెళ్లి తప్పించుకోవడానికే హత్యకు కుట్ర?
- ప్రియుడితో కలిసి పథకం రచించిన సియా
- ఆరు బృందాలతో దర్యాప్తు ముమ్మరం
- సియా కుటుంబ సభ్యుల విచారణ కొనసాగింపు
- రెండోసారి సోదరుడిని విచారించిన పోలీసులు
- క్రికెట్ మ్యాచ్‌లో చేతన్‌తో పరిచయం
- 2 వేలకుపైగా కాల్స్ గుర్తించిన పోలీసులు
- 238 గంటలు మాట్లాడుకున్నట్లు వెల్లడి
- డిలీట్ చేసిన డేటా రికవరీకి ప్రయత్నాలు

**పుణె వెలుతురు జూన్ 27:**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పుణె యువ రియల్టర్ కేతన్ అగర్వాల్ (26) హత్య కేసు దర్యాప్తు రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. ఈ కేసులో తాజాగా వెలుగులోకి వచ్చిన అంశాలు మరింత సంచలనం రేపుతున్నాయి. కేతన్‌ను వివాహం చేసుకోవడం ఇష్టం లేకపో



వడంతో సియా గోయల్ తన ప్రియుడు చేతన్ చౌదరితో కలిసి హత్యకు పథకం రచించినట్లు పోలీసు విచారణలో వెల్లడైనట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.పుణె రూరల్ పోలీసు వర్గాల సమాచారం ప్రకారం.. కుటుంబ సభ్యులకు తాను ఈ వివాహం చేసుకోవడం ఇష్టం లేదని చెప్పి వారిని బాధపెట్టడం కంటే, కేతన్‌ను హత్య చేయడమే సులభమని భావించినట్లు సియా విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ కోణంలో పోలీసులు కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.మరోవైపు కేసు విచారణను వేగవంతం చేసిన పుణె రూరల్, లోనావాలా పోలీసులు మొత్తం ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సియా గోయల్ తల్లిదండ్రులను లోనావాలా సిటీ పోలీస్ స్టేషన్‌లో విచారించగా, ఆమె సోదరుడు సాహిల్‌ను రెండోసారి ప్రశ్నించారు. శుక్రవారం దాదాపు పది గంటలపాటు సాగిన విచారణలో సాహిల్ పలు కీలక వివరాలను వెల్లడించినట్లు సమాచారం.చేతన్ చౌదరి తనకు పరిచయమేనని, తన సోదరి సియా ఓ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా అతడిని తనకు పరిచయం చేసిందని సాహిల్ పోలీసులకు తెలిపినట్లు తెలుస్తోంది. అనంతరం గత ఏడాది ఓ ఉమ్మడి స్నేహితుడు నిర్వహించిన దీపావళి వేడుకల్లో మరోసారి కలిసిన తర్వాత సియా, చేతన్‌ల మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.దర్యాప్తులో భాగంగా నిందితుల కాల్ డేటా రికార్డులను విశ్లేషించిన పోలీసులు కీలక విషయాలను గుర్తించారు. ఈ ఏడాది జనవరి నుంచి సియా, చేతన్ మధ్య దాదాపు 2 వేల ఫోన్ కాల్స్ జరిగినట్లు, మొత్తం 238 గంటల పాటు వారు సంభాషించినట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ వివరాలు కుట్ర కోణాన్ని బలపరుస్తాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.కేసులో మరిన్ని ఆధారాలు సేకరించేందుకు నిందితులు తమ మొబైల్ ఫోన్‌ల నుంచి తొలగించిన డేటాను తిరిగి రికవరీ చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. చాట్ హిస్టరీ, కాల్ రికార్డులు, ఇతర డిజిటల్ ఆధారాలను సేకరించి హత్యకు సంబంధించిన పూర్తి కుట్రను ఛేదించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ అంశాలపై పోలీసులు ఇంకా అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# తమిళనాడు మంత్రిపై డ్రగ్స్ ఆరోపణలు

- వైరల్ వీడియోతో రాజకీయ దుమారం
- మొబైల్‌పై తెల్లని పదార్థం కలకలం
- మంత్రి రాజీనామా చేయాలంటూ డిమాండ్లు
- అది మందు మాత్రేనని వివరణ
- కుమార్తె కోసం ట్యాబ్లెట్ పొడి చేశానన్న మంత్రి
- ఐపీఎల్ మ్యాచ్ నాటి వీడియో వైరల్
- 'స్టార్ట్ రన్.. స్టాప్ డ్రగ్' రోజే వెలుగులోకి
- సీఎం విజయ్‌పై డీఎంకే ప్రశ్నలు
- అనుమానాలు నివృత్తి చేయాలన్న ప్రతిపక్షం
- వివాదంపై తమిళ రాజకీయాల్లో చర్చ

**చెన్నై వెలుతురు జూన్ 27:**

తమిళనాడు మానవ వనరుల శాఖ మంత్రి డి. శరత్‌కుమార్ డ్రగ్స్ ఆరోపణలతో వివాదంలో చిక్కుకున్నారు. కొన్నేళ్ల క్రితం తీసిన ఓ వీడియో తాజాగా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే తాను ఎలాంటి మత్తు పదార్థాలు ఉపయోగించలేదని, అది తన చిన్న కుమార్తెకు ఇవ్వాల్సిన మందు మాత్రను పొడి చేసిన సందర్భమేనని మంత్రి వివరణ ఇచ్చారు.

తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన శరత్‌కుమార్‌కు టీవీకే ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కింది. తాజాగా వైరల్ అవుతున్న వీడియోలో ఆయన మొబైల్ ఫోన్ స్క్రీన్‌పై తెల్లని పదార్థాన్ని ఉంచి ఏటీఎం కార్డుతో పొడి చేస్తున్నట్లు కనిపిస్తోంది. పక్కనే రూ.500 నోటు ఉండటంతో ఈ వీడియోపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆ సమయంలో ఆయన ఐపీఎల్ మ్యాచ్‌ను వీక్షిస్తున్నట్లు కూడా వీడియోలో కనిపిస్తోంది. ఈ వీడియోను ఆయన అప్పట్లో 'థగ్ లైఫ్' పేరుతో తన సన్నిహితులకు మాత్రమే కనిపించేలా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసినట్లు సమాచారం.ముఖ్యమంత్రి విజయ్ ఆధ్వర్యంలో 'స్టార్ట్ రన్, స్టాప్ డ్రగ్' పేరుతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నిర్వహించిన మారథాన్ రోజే ఈ వీడియో బయటకు రావడంతో వివాదం మరింత ముదిరింది. మంత్రి డ్రగ్స్ వినియోగించారంటూ ఆరోపణలు వెల్లువెత్తగా, ఆయన రాజీనామా చేయాలని పలువురు డిమాండ్ చేశారు.ఈ ఆరోపణలపై స్పందించిన శరత్‌కుమార్ తన భార్య, చిన్న కుమార్తెతో కలిసి ఉన్న మరో వీడియోను విడుదల చేశారు. రెండేళ్ల క్రితం చెన్నైలోని చెపాక్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌కు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వెళ్లామని తెలిపారు. ఆ రోజు తమ ఏడాదిన్నర వయసున్న కుమార్తె అనారోగ్యంతో ఉండటంతో డాక్టర్ సూచన మేరకు లిక్విడ్‌లో కలిపి ఇవ్వడానికి ట్యాబ్లెట్‌ను పొడి చేశామని చెప్పారు. ఆ దృశ్యాలనే ఇప్పుడు దురుద్దేశంతో వైరల్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆరోపించారు.ఇదిలా ఉండగా, డీఎంకే అధికార ప్రతినిధి శరవణన్ అన్నాదురై ఈ వ్యవహారంపై ఎక్స్ వేదికగా స్పందించారు. మత్తు పదార్థాల నిర్మూలన కోసం ముఖ్యమంత్రి విజయ్ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో, తన మంత్రిపై వచ్చిన అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ప్రజల్లో ఏర్పడిన సందేహాలను అలాగే వదిలేయకుండా స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో ఈ వ్యవహారం తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



# హస్మత్‌పేట్‌లో హైడ్రా కూల్చివేతలు.. ఆక్రమణలపై ఉక్కుపాదం

- పురావస్తు శాఖ భూమిలో అక్రమ నిర్మాణాల తొలగింపు
- భారీ పోలీసు బందోబస్తుతో కొనసాగిన కూల్చివేతలు
- హస్మత్‌పేట్ చత్రిగడ్డలో హైడ్రా ప్రత్యేక చర్యలు
- జేసీబీలతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసిన అధికారులు
- 10 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఆక్రమణ గుర్తింపు
- నోటరీ ప్లాట్ల పేరుతో విక్రయాలపై అధికారుల ఆగ్రహం
- కూల్చివేతల అనంతరం కంచె ఏర్పాటు చేయనున్న హైడ్రా
- ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోనున్న అధికారులు
- ఆక్రమణదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఆక్రమణలను సహించబోమన్న స్పష్టీకరణ

**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**

అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హస్మత్‌పేట్ సర్వే నంబర్-1లో ఉన్న చత్రిగడ్డ ప్రాంతంలో హైడ్రా అధికారులు భారీ కూల్చివేతలు చేపట్టారు. పురావస్తు శాఖకు చెందిన ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన అధికారులు, శనివారం భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు.అధికారుల సమాచారం ప్రకారం, సుమారు 10 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. అంతేకాకుండా నోటరీ ప్లాట్ల పేరుతో ఈ భూమిని విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది.స్థానిక పోలీసుల సహకారంతో హైడ్రా సిబ్బంది జేసీబీలను ఉపయోగించి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.కూల్చివేతల ప్రక్రియ పూర్తయిన వెంటనే భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాన్ని అధికారికంగా స్వాధీనం చేసుకోనున్నట్లు హైడ్రా అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ భూములు, చెరువులు, ఇతర ప్రజా ఆస్తులను ఆక్రమించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని, అక్రమ ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులు స్పష్టం చేశారు.



# ఫ్లాట్ తీసుకున్నాక కూడా పరిహారం కోరొచ్చు: సుప్రీంకోర్టు

- ఆలస్యానికి బిల్డర్లను ప్రశ్నించే హక్కు కొనసాగుతుందని స్పష్టం
- ఫ్లాట్ స్వాధీనం చేసుకున్నా వినియోగ దారుడి హోదా పోదన్న తీర్పు
- జాతీయ కమిషన్ 2016 ఉత్తర్వులను పక్కనబెట్టిన ధర్మాసనం
- సేవల్లో లోపాలపై ఫిర్యాదు చేసే హక్కు కొనసాగుతుందని వెల్లడి
- మధ్యవర్తిత్వ నిబంధన ఉన్నా వినియోగ దారుల ఫోరాన్ని ఆశ్రయించొచ్చని స్పష్టీకరణ
- ఢిల్లీ ఫ్లాట్ కొనుగోలుదారుడి అప్పీల్‌కు అనుకూలంగా తీర్పు
- వినియోగదారుల హక్కులను కాపాడిన సుప్రీంకోర్టు
- బిల్డర్ల బాధ్యత నుంచి తప్పించుకో లేరన్న కీలక వ్యాఖ్య
- వినియోగదారుల రక్షణ చట్టం లక్ష్యాన్ని గుర్తు చేసిన ధర్మాసనం
- ఫిర్యాదులపై మళ్లీ విచారణ జరపాలని జాతీయ కమిషన్‌కు ఆదేశం

**న్యూఢిల్లీ వెలుతురు జూన్ 27:**

ఫ్లాట్ కొనుగోలు చేసిన తర్వాత దానిని స్వాధీనం చేసుకున్నా, బిల్డర్ లేదా రియల్ ఎస్టేట్ సంస్థ సేవల్లో లోపాలు ఉంటే వాటిపై పరిహారం కోరే హక్కు కొనుగోలు దారులకు కొనసాగుతుందని సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఫ్లాట్ తీసుకున్న తర్వాత వినియోగదారుడి హోదా ముగిసిపోతుందని, ఆ తర్వాత సేవల్లో లోపాలపై ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉండదనే అభిప్రాయాన్ని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంగా తిరస్కరించింది. ఫ్లాట్‌ను స్వీకరించడం వల్ల బిల్డర్ చేసిన తప్పులు లేదా ఆలస్యాన్ని ప్రశ్నించే హక్కు పోదని పేర్కొంది.ఈ మేరకు నేషనల్ కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రీడ్రెసల్ కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) 2016లో ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కనబెట్టింది. వినియోగదారుల హక్కులను పరిరక్షించే విషయంలో ఈ తీర్పు దేశవ్యాప్తంగా ఫ్లాట్ కొనుగోలుదారులకు ఊరటనిచ్చేలా ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఈ కేసు ఢిల్లీలోని ఒక కోఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీకి సంబంధించినది. ఓ వ్యక్తి 2003లో ఆ సొసైటీలో సభ్యుడిగా చేరి ఫ్లాట్ కొనుగోలు చేశాడు. అయితే ఫ్లాట్ అప్పగించడంలో జాప్యం, ఇతర



సేవల్లో లోపాలు ఉన్నాయని ఆరోపిస్తూ ఆయన వినియోగ దారుల ఫోరాన్ని ఆశ్రయించారు. అయితే ఫ్లాట్‌ను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నందున ఆయన ఇకపై 'వినియోగదారుడు' కాదని, అందువల్ల ఫిర్యాదు చేయడానికి అర్హుడు కాదని నేషనల్ కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రీడ్రెసల్ కమిషన్ పేర్కొంటూ ఫిర్యాదును తిరస్కరించింది.ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ బాధితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ అప్పీల్‌ను జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా జాతీయ కమిషన్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఫ్లాట్‌ను స్వాధీనం చేసుకున్నందుకు మాత్రమే కొనుగోలుదారుడు వినియోగదారుడి హోదాను కోల్పోతాడని చెప్పడం చట్టబద్ధం కాదని స్పష్టం చేసింది.ఫ్లాట్‌ను తీసుకోవడం అనేది కొనుగోలుదారుడికి అందుబాటులో ఉన్న ఒక ఎంపిక మాత్రమేనని, దాని వల్ల బిల్డర్ చేసిన సేవల్లో లోపాలు, నిర్మాణ ఆలస్యం లేదా ఒప్పంద ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసే హక్కు పోదని ధర్మాసనం పేర్కొంది. బిల్డర్ తన బాధ్యతలను పూర్తిగా నిర్వర్తించకపోతే, కొనుగోలుదారుడు నష్టపరిహారం కోరే హక్కు కొనసాగుతుందని తెలిపింది.ఇరుపక్షాల మధ్య కుదిరిన ఒప్పందంలో మధ్యవర్తిత్వం (ఆర్బిట్రేషన్) నిబంధన ఉన్నప్పటికీ, అదే కారణంతో వినియోగదారుల ఫోరంలో దాఖలు చేసిన ఫిర్యాదును తిరస్కరించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

మధ్యవర్తిత్వ నిబంధన ఉన్నంత మాత్రాన వినియోగ దారుల చట్టం కింద లభించే హక్కులు రద్దు కావని పేర్కొంది. వినియోగదారుడు కోరుకుంటే వినియోగ దారుల ఫోరాన్ని ఆశ్రయించే స్వేచ్ఛ ఉంటుందని వెల్లడించింది.ఫ్లాట్‌ను స్వాధీనం చేసుకునే ముందు లేదా తర్వాత అనే తేడా లేకుండా, సేవల్లో లోపం లేదా ఒప్పంద ఉల్లంఘన జరిగితే ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. కేవలం ఇంటిని స్వీకరించారనే కారణంతో కొనుగోలుదారుడు చట్టపరమైన హక్కులను కోల్పోయాడని భావించడం సరైంది కాదని పేర్కొంది.వస్తువుల్లో లోపాలు, సేవల్లో నిర్లక్ష్యం, నిర్మాణంలో జాప్యం, నాణ్యత సమస్యలు లేదా ఇతర ఒప్పంద ఉల్లంఘనలపై వినియోగదారులు వినియోగ దారుల రక్షణ చట్టం–1986 కింద ఫిర్యాదు చేసేందుకు పూర్తి హక్కు ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ చట్టం ఉద్దేశం వినియోగదారులకు వేగంగా, సమర్థవంతంగా న్యాయం అందించడమేనని ధర్మాసనం గుర్తు చేసింది. అలాంటి చట్టాన్ని సంకుచితంగా వ్యాఖ్యానించడం వల్ల వినియోగదారుల హక్కులు దెబ్బతింటాయని పేర్కొంది.వినియోగదారుల హక్కులను పరిరక్షించే చట్టాలను విశాల దృక్పథంతో అమలు చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. బిల్డర్లు లేదా రియల్ ఎస్టేట్ సంస్థలు తమ సేవల్లో లోపాలు ఉన్నప్పటికీ, ఫ్లాట్ అప్పగించామనే కారణంతో బాధ్యత నుంచి తప్పించుకునే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేసింది.ఈ కేసులో జాతీయ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసిన సుప్రీంకోర్టు, ఫిర్యాదును తిరిగి విచారించి చట్ట ప్రకారం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. కేసులోని వాస్తవాలు, సేవల్లో లోపాలపై చేసిన ఆరోపణలు, ఆలస్యానికి సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలించి తగిన ఉత్తర్వులు ఇవ్వాలని సూచించింది.సుప్రీంకోర్టు తాజా తీర్పు దేశవ్యాప్తంగా లక్షలాది ఫ్లాట్ కొనుగోలుదారులకు కీలక మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉంది. ఫ్లాట్ స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా బిల్డర్ సేవల్లో లోపాలు, నిర్మాణ జాప్యం, ఒప్పంద ఉల్లంఘన లేదా నష్టాలకు సంబంధించి పరిహారం కోరే హక్కు కొనసాగుతుందని ఈ తీర్పు స్పష్టం చేసింది. దీంతో రియల్ ఎస్టేట్ రంగంలో వినియోగ దారుల హక్కులకు మరింత బలం చేకూరిందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## హుస్నాబాద్ నియోజకవర్గంలో 74.49 కి.మీ మేర హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) రహదారుల అభివృద్ధికి రూ.148.97 కోట్లు మంజూరు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**

హుస్నాబాద్ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఈ మేరకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) ద్వారా మొత్తం 74.49 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి రూ.148.97 కోట్ల మంజూరు చేశారు.మంజూరైన రోడ్లలో హనుమకొండ, కరీంనగర్, సిద్దిపేట జిల్లాలకు చెందిన మొత్తం 8 ప్రధాన రహదారి పనులు ఉన్నాయి. వీటి ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గంలోని గ్రామాలకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పించడంతో పాటు ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది.



**హుస్నాబాద్ నియోజకవర్గంలో మనురైన హామ్ రోడ్ల వివరాలు:**

**హనుమకొండ జిల్లా**

1.హనుమకొండ జిల్లాలోని గుంటూరుపల్లి – కేశవాపూర్ వయా తిమ్మాపూర్ రహదారి బలోపేతం (3.99 కి.మీ.) రూ.3.5 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు..

2.హనుమకొండ జిల్లాలోని వంగర – ములకనూరు – భీమదేవరపల్లి రహదారి బలోపేతం 5.00 కి.మీ లకు రూ.4.39 కోట్ల రూపాయలు

3.హనుమకొండ జిల్లా పరిధిలోని బావుపేట్ – కమలాపూర్ రోడ్ (బావుపేట్ , ఆరేపల్లి, గుంటూరుపల్లి, శంబునిపల్లి , కనిపర్తి కమలాపూర్) 6.00 కి.మీ లకు రూ.6.95 కోట్ల రూపాయలు

**కరీంనగర్ జిల్లా**

4.కొత్తగట్టు–దుద్దెనపల్లి రహదారి బలోపేతం (10.90 కి.మీ లకు రూ.9.57 కోట్ల రూపాయలు

సిద్దిపేట జిల్లా లో మంజూరైన రోడ్లు

5.తంగలపల్లి – బద్దిపడిగ వయా గుండారెడ్డిపల్లి రహదారి బలోపేతం 8.00 కి.మీ లకు రూ.7.02 కోట్ల రూపాయలు

6.ముల్కనూర్–కొహెడ రహదారి బలోపేతం 16.00 కి.మీ లకు 18.53 కోట్ల రూపాయలు

7.కోహెడ – దేవక్కపల్లి వయా రామచంద్రాపూర్ రహదారి విస్తరణ, బలోపేతం 14.60 కి.మీ లకు 40.1 కోట్ల రూపాయలు

8.హుస్నాబాద్–అక్కన్నపేట పీడబ్ల్యూడీ రహదారి విస్తరణ, బలోపేతం 10.00 కి.మీ. లకు రూ.58.91 కోట్లు

హుస్నాబాద్ నియోజకవర్గంలో భారీ మొత్తం లో రోడ్ల అభివృద్ధికి 148.97 కోట్ల రూపాయలు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గారికి ,మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారికి మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.ఈ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ, వాణిజ్య, విద్య, వైద్య సేవలకు మెరుగైన అనుసంధానం ఏర్పడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.హుస్నాబాద్ నియోజకవర్గ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ రహదారి ప్రాజెక్టులు కీలక మైలురాయిగా నిలుస్తాయన్నారు.

## మనసున్న ప్రభుత్వం మంచి కార్యక్రమం

- హెలెన్ కెల్లర్ స్ఫూర్తితో దివ్యాంగులకు మరింత అండగా తెలంగాణ ప్రభుత్వం
- 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఈ-ఆటోల పంపిణీ
- దివ్యాంగులకు జాలి కాదు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి సీతక్క

**వెలుతురు హైదరాబాద్ జూన్ 27:**

దివ్యాంగుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమంలో మరో కీలక అడుగు వేసిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అన్నారు. రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఈ–ఆటోలను ప్రారంభిస్తూ ఆమె మాట్లాడారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, సెర్ప్ లో దివ్యాంగుల సంక్షేమ విభాగ డైరెక్టర్ ఎల్ కృష్ణమూర్తి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు పీయూష్ మిట్టల్, కైలాష్, అధికారులు, దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.హెలెన్ కెల్లర్ జీవితం ప్రపంచానికే స్ఫూర్తి అని మంత్రి సీతక్క అన్నారు. చిన్న వయసులోనే చూపు, వినికిడి కోల్పోయినా సంకల్పబలంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆమె చెప్పిన "ఒంటరిగా మనం చాలా తక్కువ చేయగలం... కలిసి ఉంటే ఎంతో సాధించగలం" అనే సందేశం ఈ కార్యక్రమానికి సరిగ్గా సరిపోతుందని అన్నారు.దివ్యాంగులను జాలి చూపాల్సిన వారిగా కాకుండా సమాజ అభివృద్ధిలో సమాన భాగస్వాములుగా చూడాలన్నదే తెలంగాణ ప్రభుత్వ విధానమని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దివ్యాంగులకు విద్య, ఉపాధి, పునరావాసం, జీవనోపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.గత రెండు దశాబ్దాలుగా మహిళల సాధికారత కోసం విశేషంగా పనిచేస్తున్న సెర్ప్‌కు ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమ బాధ్యతలను కూడా అప్పగించిందని తెలిపారు. మహిళా సంఘ సభ్యుల దివ్యాంగ పిల్లలకు ఈ లోటు రాకుండా చూసుకునే బాధ్యత





అప్పగించామన్నారు.సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, డైరెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో తక్కువ కాలంలోనే దివ్యాంగులను సంఘటితం చేసి రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకుపైగా దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం 82 వేల మందికి పైగా సభ్యులు ఈ సంఘాల్లో ఉన్నారని తెలిపారు. స్త్రీనిధి ద్వారా రూ.38.16 కోట్ల రుణాలు, గ్రామ మహిళా సంఘాల ద్వారా రూ.4.13 కోట్ల రుణాలు, రూ.11.62 కోట్ల పొదుపులు,2,248 మందికి జీవనోపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.ప్రస్తుతం 26 జిల్లాల్లో 74 నైబర్‌హుడ్ సెంటర్ల ద్వారా కమ్యూనిటీ మేనేజ్డ్ రిహాబిలిటేషన్ సర్వీసెస్ కార్యక్రమాన్ని మహిళా సంఘాల ఆధ్వర్యంలో విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. మండల మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైబర్హుడ్ సెంటర్ల లో దాదాపు మూడు వేల మంది దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్య, కౌన్సెలింగ్, నైపుణ్యాభివృద్ధి వంటి సేవలు అందుతున్నాయని వివరించారు. తల్లిదండ్రులకు శిక్షణ, కౌన్సెలింగ్‌తో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.ఈ–ఆటోలు కేవలం వాహనాలు కాదని, ఎన్నో కుటుంబాలకు ఆశను, దివ్యాంగులకు ఆత్మవిశ్వాసాన్ని అందించే సాధనాలని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు రవాణా సమస్యల వల్ల పిల్లలను కేంద్రాలకు తీసుకురాలేకపోయిన కుటుంబాలకు ఇకపై ఇంటి వద్ద నుంచే ఉచిత రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ముఖ్యంగా ఆటిజం, మేధోవైకల్యం తదితర వైకల్యాలు ఉన్న పిల్లలు క్రమం తప్పకుండా థెరపీ, శిక్షణ పొందేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.శారీరక లోపం ఉన్నవారే దివ్యాంగులు కాదని, ఇతరులను అవమానించే మనస్తత్వం, అహంకారం, మానవత్వం లేకపోవడం కూడా ఒక విధమైన వైకల్యమని అన్నారు. దివ్యాంగులను చీదరించకుండా, వారికి అవకాశాలు కల్పిస్తే వారు అద్భుత విజయాలు సాధిస్తారని చెప్పారు. కళ్లు కనిపించకపోయినా బ్రెయిలీ ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకున్నవారు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. హెలెన్ కెల్లర్ లాగే ప్రతి దివ్యాంగుడిలో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని అన్నారు.పుట్టుకతో వచ్చిన వైకల్యాలను కూడా తల్లిదండ్రుల ప్రేమ, ప్రోత్సాహం, సరైన శిక్షణతో ఎంతోవరకు అధిగమించవచ్చని చెప్పారు. దివ్యాంగ పిల్లల పట్ల కుటుంబ సభ్యులు నిరాశ చెందకుండా మరింత శ్రద్ధ చూపాలని సూచించారు.ముఖ్యమంత్రి సహకారంతో దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి త్రిచక్ర వాహనాలు, జీవనోపాధి అవకాశాలు, స్వయం సహాయక సంఘాలు, నైబర్‌హుడ్ సెంటర్లు వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల పేరిటే ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటూ వారికి సామాజిక భద్రత కల్పిస్తున్నామని చెప్పారు.సీఎస్ఆర్ నిధుల ద్వారా ఈ కార్యక్రమానికి సహకరించిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు, సమాజం కలిసి పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ప్రతి దివ్యాంగుడికి సేవలు వారి ఇంటి సమీపంలోనే అందేలా నైబర్‌హుడ్ సెంటర్లను మరింత బలోపేతం చేస్తామని, అవసరమైన చోట కొత్త కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలను విస్తరిస్తామని మంత్రి ప్రకటించారు. దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించి ప్రజలు సూచనలు ఇవ్వాలని, వాటిని ప్రభుత్వ విధానాల్లో అమలు చేసి వారి జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగులకు జాలి కాదు... గౌరవం, సమాన అవకాశాలు, ఆదరణ ఇవ్వాలనే సంకల్పంతో ముందుకు సాగుదామని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. అదే హెలెన్ కెల్లర్‌కు మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు.

## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని న్యాయ, రాజ్యాంగపరంగా వ్యతిరేకించాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయం

- రాష్ట్రాల హక్కులు, గ్రామీణ పేదల ఉపాధికి భంగం కలిగించే నిబంధనలను కేంద్రం వెంటనే సవరించాలి
- రాష్ట్ర ప్రభుత్వంపై 40 శాతం ఆర్థిక భారం మోపి... అధికారాలన్నీ కేంద్రం వద్దే ఉంచడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం
- జూలై 2న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సబ్ కమిటీ సిఫార్సులపై తుది నిర్ణయం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**

వీబీజీ రామ్‌జీ చట్టం–2025 రాష్ట్రాల రాజ్యాంగబద్ధ హక్కులను హరించే విధంగా, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గ్రామీణ పేదల ఉపాధి హక్కు, రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలనా అధికారాలు, ఆర్థిక స్వయం ప్రతిపత్తిపై ప్రతికూల ప్రభావం చూపే ఈ చట్టంలోని నిబంధనలను న్యాయపరంగా, రాజ్యాంగపరంగా వ్యతిరేకించాలని కేబినెట్ సబ్ కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ మేరకు రూపొందించిన సిఫార్సులను జూలై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన వీబీజీ రామ్‌జీ చట్టం–2025 ప్రభావాలపై కేబినెట్ సబ్ కమిటీ రెండో సమావేశం జరిగింది. సమావేశంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రత్యక్షంగా పాల్గొనగా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, గడ్డం వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ దాన కిషోర్, కమీషనర్ దివ్యా దేవరాజన్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, నిపుణులు సమావేశంలో పాల్గొని చట్టంలోని వివిధ అంశాలపై సమగ్ర నివేదికను సమర్పించారు.వీబీజీ రామ్‌జీ చట్టం ప్రకారం ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు 40 శాతం వరకు ఆర్థిక భారం భరించాల్సి వస్తున్నప్పటికీ, పనుల ఎంపిక, ప్రణాళిక, ఆమోదం, అమలు, పర్యవేక్షణ వంటి కీలక అంశాలన్నింటిలోనూ రాష్ట్రాలకు నిర్ణయాధికారం కల్పించకపోవడం తీవ్ర అభ్యంతరకరమని సమావేశం అభిప్రాయపడింది. నిధుల బాధ్యత రాష్ట్రాలపై మోపుతూ, అధికారాలను పూర్తిగా కేంద్రం వద్దే కేంద్రీకరించడం భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని సభ్యులు పేర్కొన్నారు.గ్రామీణ పేదల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపే 60 రోజుల ఉపాధి విరామం నిబంధన ఆచరణ సాధ్యం కాదని మంత్రులు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనుల స్వభావం, వాతావరణ పరిస్థితులు, పేద కుటుంబాల జీవనాధారాన్ని దృష్టిలో ఉంచుకుంటే 60 రోజులపాటు ఉపాధి లేకుండా ఉండడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఈ నిబంధన వల్ల లక్షలాది నిరుపేద కూలీ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో 60 రోజుల విరామ కాలంలోనూ కూలీలకు ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావచ్చా అనే



అంశంపైనా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. అయితే కేంద్రం రూపొందించిన వీబీజీ రామ్‌జీ చట్టానికి భిన్నంగా రాష్ట్రం ప్రత్యేక చట్టం అమలు చేస్తే, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి సంబంధించిన నిధులను నిలిపివేసే అవకాశం ఉందని అధికారులు వివరించారు. దీంతో రాజ్యాంగ, న్యాయపరమైన అన్ని కోణాలను పరిశీలించి ముందుకు వెళ్లాలని సమావేశం నిర్ణయించింది.ప్రస్తుతం కేంద్రం అమలు చేస్తున్న నార్మెటివ్ అలొకేషన్ విధానం గ్రామీణ ప్రాంతాల వాస్తవ అవసరాలకు అనుగుణంగా లేదని సమావేశం అభిప్రాయపడింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అసలు ఉద్దేశం ప్రకారం పని కోరిన ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సభ్యులు పేర్కొన్నారు. అందువల్ల నార్మెటివ్ పరిమితులు కాకుండా డిమాండ్ ఆధారంగా నిధులు విడుదల చేసే విధానాన్ని కేంద్రం వెంటనే అమలు చేయాలని నిర్ణయించారు.తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. కొత్త చట్టం వల్ల రాష్ట్రానికి కలిగే అదనపు ఆర్థిక, పరిపాలనా భారం పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేయాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. అలాగే సోమవారం ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో జరిగే సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలు, సూచనలు, సవరణల ప్రతిపాదనలను స్పష్టంగా వినిపించాలని నిర్ణయించారు.దీంతో పాటు వీబీజీ రామ్‌జీ చట్టంలోని అన్ని కీలక నిబంధనలను సమగ్రంగా సమీక్షించారు. గ్రామీణ ఉపాధి హక్కు, పేదల జీవనోపాధి, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు, అమలు వ్యవస్థ, ఆర్థిక బాధ్యతలు, కేంద్ర రాష్ట్ర సంబంధాలపై ఈ చట్టం చూపే ప్రభావాన్ని సభ్యులు విస్తృతంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సిన అధికారిక అభిప్రాయాలు, సవరణల సిఫార్సులను ఖరారు చేశారు.సమీక్ష సమావేశం అనంతరం వివిధ కార్మిక సంఘాలు, పౌరసంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులతో కేబినెట్ సబ్ కమిటీ ప్రత్యేకంగా సమావేశమైంది. వీబీజీ రామ్‌జీ చట్టంపై వారు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, సూచనలు, ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను సభ్యులు శ్రద్ధగా విన్నారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు కొనసాగించడంతో పాటు, అవసరమైతే న్యాయస్థానాలను కూడా ఆశ్రయించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది.

# ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సమర్థవంతంగా చేరేలా అధికారులు కృషి చేయాలి

- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి గోష్

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 27:**



ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సమర్థవంతంగా చేరేలా అధికారులు కృషి చేయాలని ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి, ఫ్లాగ్‌షిప్ సంక్షేమ మరియు అభివృద్ధి పథకాల అమలు విభాగం, సీఎస్ఆర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ సవ్యసాచి గోష్ సూచించారు.శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డితో కలిసి ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 99 రోజుల కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థ వంతంగా అందించడంలో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారం, సేవల అందజేత, మౌలిక సదుపాయాల మెరుగుదల, సంక్షేమ పథకాల అమలులో విశేష ఫలితాలు సాధించాయని పేర్కొన్నారు. 99 రోజుల కార్యక్రమంలో సాధించిన విజయాలను కొనసాగిస్తూ, పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకొని నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ సేవలు ప్రతి అర్హుడికి సకాలంలో అందేలా అన్ని శాఖలు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు క్షేత్రస్థాయిలో ఎలా జరుగుతోందో పరిశీలించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించడం లక్ష్యంగానే ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం, లబ్ధిదారుల నుంచి వినతులను స్వీకరించి సత్వర చర్యలు తీసుకోవడం, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అధికారుల ప్రధాన బాధ్యత అని తెలిపారు.రంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విజయవంతంగా అమలు చేసిన జిల్లా కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులను ప్రత్యేక అధికారి అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే పనితీరును కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ లబ్ధిదారుని విస్మరించకూడదని సూచించారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉత్తమ విధానాలను వినూత్న ఆలోచనలతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలుపరచడం ద్వారా రంగారెడ్డి జిల్లా ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. పథకాల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లాలో విద్య, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక ద్వారా సమర్థ వంతమైన కార్యక్రమాలు అమలు చేసినట్లు ప్రశంసించారు. ఆర్థిక వ్యవహారాల విషయంలో పూర్తి అప్రమత్తతతో పథకాలను అమలు చేయాలని అధికారులకు సూచించారు.

అంతకుముందు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేక అధికారికి వివరించారు. అనంతరం జిల్లా శాఖల అధికారులు ఆయా శాఖల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ప్రత్యేక అధికారికి జిల్లా కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి అనంత్ రెడ్డి, సిపిఓ సౌమ్య, ట్రాఫిక్ డీసీపీ, ఆర్డీఓలు జగదీశ్వర్ రెడ్డి, సరిత, డిపిఓ సురేశ్ మోహన్, డీఆర్డీఏ పిడి శ్రీలత, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి , సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, సంక్షేమ శాఖ అధికారులు కేశురామ్, నవీన్ కుమార్ రెడ్డి, రామేశ్వరి దేవి, థీమ్ నోడల్ అధికారులు, జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు చుక్కలు..పిల్లల జీవితాలకు రక్షణ

**తల్లిదండ్రులు పిల్లలకు తప్పక పోలియో చుక్కలు వేయించాలి.**

**2800 పోలియో కేంద్రాలు, 38 ట్రాన్సిట్ కేంద్రాలు ఏర్పాటు.**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా**

**హైదరాబాద్ జిల్లా వెలుతురు జూన్ 27:**

జిల్లాలోని జాతీయ టీకాకరణ దినోత్సవం (National Immunization Day - NID) సందర్భంగా జూన్ 28వ తేదీన పల్స్ పోలియో టీకా కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా తెలిపారు. ఈ సంవత్సరం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణలో 28వ సంవత్సరం. భారతదేశంలో చివరి పోలియో కేసు 13 జనవరి 2011న గుర్తించబడింది. అనంతరం 2012లో భారత్ పోలియో వ్యాధి ప్రబల దేశాల జాబితా నుండి తొలగించబడగా, 2014 మార్చి 27న ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) నుండి పోలియో రహిత దేశంగా ధృవీకరణ పత్రం పొందింది.తెలంగాణ రాష్ట్రంలో చివరి పోలియో కేసు 2007లో నల్గొండ జిల్లాలో అలాగే హైదరాబాద్ జిల్లాలో చివరి పోలియో కేసు 1998లో నమోదైంది.

28వ తేదీ ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో 0–5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచితంగా పోలియో చుక్కలు అందించడం జరుగుతుందని పిల్లల తల్లిదండ్రులు కేంద్రాలలో పిల్లలకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

అలాగే ఇంటింటి సర్వే ద్వారా

తేదీలు: 29-06-2026 నుండి 01-07-2026 వరకు

పోలియో బూత్‌లలో పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయబడతాయి.

0–5 సంవత్సరాల పిల్లలు : 5,04,803 మంది కలరని, 2,800 పోలియో బూత్‌లు , 38 ట్రాన్సిట్ బూత్‌లు (రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, మెట్రో స్టేషన్లు తదితర ప్రాంతాల్లో) 91 మొబైల్ బృందాలు- 193 అధిక ప్రమాద (High Risk) ప్రాంతాలు ప్రత్యేకంగా గుర్తించడం జరిగిందని తెలిపారు.

అలాగే నిర్మాణ ప్రదేశాలు, వలస కూలీల కాలనీలు, సంచార జాతులు, బిచ్చగాళ్ల నివాస ప్రాంతాలు, మార్కెట్లు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు, ఉద్యానవనాలు తదితర ప్రాంతాలలో ప్రత్యేక బృందాలు సేవలందిస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు అలాగే ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది


మొత్తం 11,500 మందికి పైగా ఈ కార్యక్రమ నిర్వహణకు నియమించడం జరిగిందని పేర్కొన్నారు.

పోలియో వ్యాక్సిన్ నాణ్యతను కాపాడేందుకు +2°C నుండి +8°C ఉష్ణోగ్రతల మధ్య భద్రపరచబడుతుంది. ఇందుకోసం జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలలో ILRs, డీప్ ఫ్రీజర్లు, కోల్డ్ బాక్స్‌లు, వ్యాక్సిన్ క్యారియర్లు, ఐస్ ప్యాక్‌లు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు.

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించి ప్రతి అర్హత కలిగిన చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి, గతంలో ఎన్ని సార్లు పోలియో చుక్కలు వేసినా సరే, జూన్ 28న తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించండి.

"పోలియో రహిత నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అవసరమని కలెక్టర్ తెలిపారు".



# కౌశల్ మహోత్సవ్ - వరంగల్ 2026లో 1,000 మందికి పైగా తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు

**న్యూఢిల్లీ వెలుతురు 27 జూన్ 2026:**






కేంద్ర నైపుణ్యాభివృద్ధి మరియు పారిశ్రామికవేత్తల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (MSDE), తెలంగాణ ప్రభుత్వం మరియు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NSDC) సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్‌లోని ★★కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (KITS)★★లో నిర్వహించిన ★★'కౌశల్ మహోత్సవ్ – వరంగల్ 2026'★★లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 1,000 మందికి పైగా యువ ఉద్యోగార్థులు ఉద్యోగ ఆఫర్లు పొందారు. ఈ ఒక్కరోజు కార్యక్రమం నైపుణ్యాలు కలిగిన యువతను పరిశ్రమలతో అనుసంధానిస్తూ, ప్రత్యక్ష ఇంటర్వ్యూలు, నియామకాలు, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు, వృత్తి మార్గదర్శకతకు సమర్థవంతమైన వేదికగా నిలిచింది.వరంగల్‌తో పాటు సమీప జిల్లాల యువత నుంచి ఈ మహోత్సవానికి విశేష స్పందన లభించింది. 4,500 మందికి పైగా అభ్యర్థులు నమోదు చేసుకోగా, 2,200 మందికి పైగా అభ్యర్థులు ప్రత్యక్ష నియామక ప్రక్రియలో పాల్గొన్నారు. 90కు పైగా ప్రముఖ సంస్థలు పాల్గొని వివిధ రంగాల్లో వేలాది ఉద్యోగ అవకాశాలను అందించాయి.ప్రత్యక్ష నియామక ప్రక్రియలో ఎంపిక కాకపోయిన అభ్యర్థుల దరఖాస్తులను కూడా పాల్గొన్న సంస్థలు తమ నియామక ప్రక్రియలో భాగంగా పరిశీలిస్తాయి. అర్హత కలిగిన అభ్యర్థులను తదుపరి ఎంపిక దశల కోసం ఆయా సంస్థలు నేరుగా సంప్రదిస్తాయి.మహోత్సవం సందర్భంగా తయారీ, ఆటోమొబైల్, లాజిస్టిక్స్, వస్త్ర పరిశ్రమ, రిటైల్, ఆరోగ్య సేవలు, ఐటీ–ఐటీఈఎస్, టెలికాం, పర్యాటకం & ఆతిథ్య రంగం, బ్యాంకింగ్–ఆర్థిక సేవలు–బీమా (BFSI) వంటి విభిన్న రంగాల్లో సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసి ఉద్యోగ ఆఫర్లు జారీ చేశాయి. పాఠశాల విద్య పూర్తి చేసినవారు, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తిచేసినవారు, నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణులు తదితర విభిన్న విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఇందులో పాల్గొన్నారు. పరిశ్రమల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరులపై పెరుగుతున్న డిమాండ్‌కు ఇది నిదర్శనంగా నిలిచింది.ఈ కార్యక్రమానికి కిట్స్ కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే శ్రీ వి. సతీష్ కుమార్, వర్ధన్నపేట ఎమ్మెల్యే శ్రీ కె.ఆర్. నాగరాజ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీ కపిలవాయి దిలీప్ కుమార్, ప్రాంతీయ సంచాలకుడు (RDSDE తెలంగాణ) శ్రీ రవి చిలుకోటి (ISDS), వరంగల్ పోలీసు కమిషనర్ శ్రీ సన్‌ప్రీత్ సింగ్ (IPS), తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కురపాటి వెంకట నారాయణ, మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ న్యాయ విభాగం డీన్ శ్రీ గాలి వినోద్ కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ శ్రీ చంద్రశేఖర్, కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రసంగించిన అతిథులు పరిశ్రమలతో అనుసంధానమైన నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించడం, ప్రభుత్వం–పరిశ్రమ–విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేయడం అవసరమని పేర్కొన్నారు. కౌశల్ మహోత్సవ్ వంటి కార్యక్రమాలు నైపుణ్యం కలిగిన యువతను నాణ్యమైన ఉపాధితో అనుసంధానించడంలో, నైపుణ్యవంతమైన, సాధికారత కలిగిన, ఆత్మనిర్భర్ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వారు తెలిపారు.

ఈ సందర్భంగా కేంద్ర నైపుణ్యాభివృద్ధి మరియు పారిశ్రామికవేత్తల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (MSDE) డైరెక్టర్ శ్రీ వి.ఎస్. అరవింద్ మాట్లాడుతూ, "వరంగల్‌లో నిర్వహించిన కౌశల్ మహోత్సవ్‌కు యువత నుంచి విశేష స్పందన లభించింది. 4,500 మందికి పైగా యువత నమోదు చేసుకోగా, 2,200 మందికి పైగా ప్రత్యక్ష నియామక ప్రక్రియలో పాల్గొన్నారు. వారిలో 1,000 మందికి పైగా, అంటే దాదాపు 50 శాతం మందికి ఇప్పటికే ఉద్యోగ ఆఫర్లు లభించడం సంతోషకరం. కార్యక్రమం అనంతరం కూడా నియామక ప్రక్రియ కొనసాగుతుంది. పాల్గొన్న సంస్థలు దరఖాస్తులను మరింత పరిశీలించి అర్హులైన అభ్యర్థులను తదుపరి ఎంపిక దశల కోసం నేరుగా సంప్రదిస్తాయి" అని తెలిపారు.

ఫ్ట్ పర్సనల్ ప్రైవేట్ లిమిటెడ్, పారడైమ్ ఐటీ టెక్నాలజీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సీతారాం స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్‌షిప్ నెట్‌వర్క్, కాప్‌స్టన్ సర్వీసెస్ లిమిటెడ్, క్రీమ్ స్టోన్, జయభేరి ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బ్లింక్ కామర్స్ ప్రైవేట్ లిమిటెడ్, గెలాక్టిక్ సొల్యూషన్, ఎస్ఎమ్‌జీ ఎలక్ట్రిక్ స్కూటర్స్, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎలక్ట్రోల్యాబ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తదితర ప్రముఖ సంస్థలు ఈ మహోత్సవంలో పాల్గొని వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలను అందించాయి.అలాగే, తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (TOMCOM) నియామక భాగస్వామిగా పాల్గొని అర్హులైన అభ్యర్థులకు 200కు పైగా విదేశీ ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకు వచ్చింది. దీంతో తెలంగాణకు చెందిన నైపుణ్యవంతులైన యువతకు అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు కూడా విస్తరించాయి. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో NSDC కీలక సమన్వయ బాధ్యతలు నిర్వహించింది.ఉద్యోగ నియామకాలతో పాటు, ఈ మహోత్సవం అప్రెంటిస్‌షిప్ అవకాశాలు, ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించే వేదికగా కూడా నిలిచింది. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (PMKVY), నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ (NAPS), స్కిల్ ఇండియా డిజిటల్ తదితర ప్రధాన కార్యక్రమాలపై అభ్యర్థులకు మార్గదర్శకత అందించారు. నిరంతర నైపుణ్యాభివృద్ధి, ఉన్నత నైపుణ్యాల సాధన (Upskilling), పునఃనైపుణ్యాభివృద్ధి (Reskilling) ద్వారా ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచడమే ఈ కార్యక్రమాల లక్ష్యమని వివరించారు.పరిశ్రమలు మరియు నైపుణ్యం కలిగిన యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి మధ్య ప్రత్యక్ష అనుసంధానాన్ని కల్పిస్తున్న కేంద్ర మంత్రిత్వ శాఖ యొక్క ప్రధాన ఉపాధి–అనుసంధాన కార్యక్రమాల్లో కౌశల్ మహోత్సవ్ ఒకటిగా ఎదిగింది. వరంగల్‌లో జరిగిన ఈ కార్యక్రమం విజయవంతం కావడం ద్వారా 'వికసిత్ భారత్ @2047' లక్ష్యానికి అనుగుణంగా నైపుణ్యవంతమైన, సాధికారత కలిగిన, ప్రపంచ స్థాయిలో పోటీపడగల శ్రామికశక్తిని తీర్చిదిద్దాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పానికి మరింత బలం చేకూరింది.

# MSME లతో భారత ఆర్థిక వ్యవస్థను...





(మొదటి పేజీ తరువాయి)

ఎంఎస్ఎంఈల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సంపూర్ణ నిబద్ధతతో పనిచేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవం సందర్భంగా ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) తెలంగాణ ఎంఎస్ఎంఈ విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మీడియా ప్లస్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈల ప్రోత్సాహం కాంగ్రెస్ పార్టీ ఆర్థిక విధానంలో ఎన్నో ఏళ్లుగా కీలక అంశంగా ఉందని, 2019లో దీనిని అధికారిక విధానంగా స్వీకరించామని తెలిపారు."కొద్దిమంది చేతుల్లో సంపద కేంద్రీకృతం కావడం దేశాభివృద్ధికి మంచిది కాదు. చిన్న పారిశ్రామికవేత్తలకు మరిన్ని అవకాశాలు కల్పించడం ద్వారా సమాన అవకాశాల సమాజాన్ని నిర్మించాలి" అని ఆయన అన్నారు.ప్రపంచ వ్యాప్తంగా ఎంఎస్ఎంఈలు 60 శాతానికి పైగా ఉపాధిని కల్పిస్తున్నాయని, ముఖ్యంగా ఆసియా దేశాల్లో ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దాదాపు సగం వాటాను అందిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో మూడు నుంచి ఐదుగురికి ఉపాధి కల్పించే చిన్న పరిశ్రమలే ప్రధాన బలమని, సంపన్నులు–పేదల మధ్య పెరుగుతున్న ఆర్థిక అంతరాన్ని తగ్గించాలంటే మరిన్ని ఎంఎస్ఎంఈలను స్థాపించాల్సిన అవసరం ఉందన్నారు.రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలు, సమస్యలను కాంగ్రెస్ పార్టీ మరింత లోతుగా అర్థం చేసుకునేందుకు దోహదపడిందని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక కుల గణనను ఆయన చారిత్రాత్మక నిర్ణయంగా అభివర్ణిస్తూ, 1931 తర్వాత ఇంత సమగ్రంగా నిర్వహించిన తొలి సర్వే ఇదేనని పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా అన్ని వర్గాల ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు మరింత లక్ష్యబద్ధమైన సంక్షేమ పథకాలు అమలు చేయడానికి అవకాశం కలుగుతుందని అన్నారు.మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రాధాన్యం ఇచ్చిందని పేర్కొంటూ, ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వంటి నాయకత్వాన్ని ఉదాహరణగా చూపించారు. మహిళలు విమానయానం, ఇంజినీరింగ్, పరిపాలన సహా అన్ని రంగాల్లో ప్రతిభ చాటారని చెప్పారు."భారతదేశానికి మహిళా ప్రధానమంత్రి, మహిళా రాష్ట్రపతి లభించడం కాంగ్రెస్ పార్టీ మహిళా సాధికారతకు ఇచ్చిన ప్రాధాన్యానికి నిదర్శనం. అభివృద్ధి చెందిన కొన్ని దేశాల్లో కూడా ఈ అవకాశం ఇంకా రాలేదు" అని ఆయన అన్నారు.ఎంఎస్ఎంఈల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటిస్తూ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రేషన్ కార్డుల జారీ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ తెలంగాణ చీఫ్ డా. జీలాల్మన్ టఫెస్సే, టర్కీ కాన్సులేట్ జనరల్ కమర్షియల్ అటాషే శ్రీమతి టుగ్సే గుల్, ఎఫ్‌టీసీసీఐ సీనియర్ డైరెక్టర్ & డిప్యూటీ సీఈఓ శ్రీమతి టి. సుజాత, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఎంఎస్ఎంఈస్ తెలంగాణ చైర్మన్ పి. శ్రీనివాస్, మాజీ ఏఐపీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర సంతోష్ కుమార్, మాజీ ఏఐపీసీ చాప్టర్ అధ్యక్షుడు ఇర్ఫాన్ అజీజ్, ఏఐపీసీ తెలంగాణ ఎంఎస్ఎంఈ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శశాంక్ పసుపులేటి, డిప్యూటీ హెడ్ అబ్దుల్లా బక్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# మూడు రాష్ట్రాల సీఎంల భేటీ వివరాలు వెల్లడించాలి: హరీశ్‌రావు

- కర్ణాటకతో కుమ్మక్కయ్యారని ఆరోపణ
- అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్
- ఉత్తమ్, అధికారులను బయటే ఉంచారని విమర్శ
- తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్న ఆందోళన
- చంద్రబాబు మాటే కేంద్రం వింటోందని వ్యాఖ్య
- ఓటమి భయంతో నిజాలు దాస్తున్నారన్న విమర్శ
- తెలంగాణకు అన్యాయం జరిగితే ఊరుకో

**బోమని హెచ్చరిక**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 27:**

మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య కర్ణాటకలో జరిగిన భేటీలో ఏం చర్చించారో, ఎలాంటి ఒప్పందాలు కుదిరాయో ప్రజలకు వెల్లడించాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. చారిత్రక ఒప్పందం జరిగిందని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆ ఒప్పందాల పూర్తి వివరాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు.శనివారం మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు..

కర్ణాటక ప్రభుత్వంతో రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారనే అనుమానం వ్యక్తం చేశారు. మూడు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలను శాసనసభలో ప్రవేశపెట్టి చర్చించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకతో జరిగిన ఒప్పందాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.హోస్పేటలో జరిగిన సీఎంల సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సంబంధిత అధికారులను బయట కూర్చో బెట్టారని హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవిష్యత్‌కు సంబంధించిన అంశాలను కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేతిలో ఎలా పెడతారని ప్రశ్నించారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏది చెబితే కేంద్ర ప్రభుత్వం అదే వింటోందని హరీశ్‌రావు విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగితే బీఆర్‌ఎస్ ఊరుకోదని హెచ్చరించారు.

రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారని ఆరోపించారు.కాగా, ఈ నెల 25న కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు.

# తిరుమలలో భక్తుల రద్దీ...

(మొదటి పేజీ తరువాయి)

వైకుంఠ క్యూ కాంప్లెక్సులతో పాటు నారాయణగిరి షెడ్లు కూడా పూర్తిగా నిండిపోయాయి. శ్రీవారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.టీటీడీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, దర్శన టోకెన్లు లేని భక్తులకు ప్రస్తుతం శ్రీవారి దర్శనం కోసం సుమారు 18 గంటల సమయం పడుతోంది. రద్దీ మరింత పెరగడంతో క్యూ లైన్లు నిరంతరం భక్తులతో నిండిపోతున్నాయి.మరోవైపు తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణునివాసం టోకెన్ కౌంటర్ల వద్ద కూడా భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. సాధారణంగా మధ్యాహ్నం 12 గంటలకు జారీ చేసే సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లను, రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు రెండు గంటల ముందుగానే పంపిణీ చేశారు.క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. శ్రీవారి సేవకుల ద్వారా అల్పాహారం, తాగునీరు, పాలు తదితర అవసరాలను అందిస్తున్నారు. అలాగే వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య చర్యలను కూడా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.సెలవుల కారణంగా రానున్న రోజుల్లో కూడా భక్తుల రద్దీ కొనసాగనున్న నేపథ్యంలో, దర్శనానికి వచ్చే భక్తులు తగిన ప్రణాళికతో రావాలని టీటీడీ అధికారులు సూచిస్తున్నారు. అధికారులు సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ సహకరించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

# భారత్‌కు రానున్న ట్రంప్.. దౌత్య సంబంధాలకు కొత్త దిశ

- ట్రంప్ పర్యటనతో భారత్-అమెరికా బంధాలు మరింత బలోపేతం
- ద్వైపాక్షిక సంబంధాల్లో కీలక మలుపుగా ట్రంప్ టూర్
- వ్యూహాత్మక చర్చలకు రంగం సిద్ధం చేస్తున్న ఇరు దేశాలు
- మోదీ-ట్రంప్ భేటీపై అంతర్జాతీయ వర్గాల్లో ఆసక్తి
- వాణిజ్య ఒప్పందాలకు ట్రంప్ పర్యటన ఊతమివ్వనుంది
- క్వాడ్ భాగస్వామ్యంలో కొత్త చైతన్యం రానుంది
- పశ్చిమాసియా ఉద్రిక్తతల మధ్య ట్రంప్ భారత్ పర్యటన ప్రాధాన్యం
- ఆర్థిక, భద్రతా అంశాలపై కీలక చర్చలు జరిగే అవకాశం
- భారత్‌తో సత్సంబంధాలకు అమెరికా ప్రాధాన్యం
- ఇరు దేశాల దౌత్య బంధాలకు కొత్త ఊపు

**న్యూఢిల్లీ, వెలుతురు జూన్ 27:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ త్వరలో భారత్ పర్యటనకు రానుండటం అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, ఇరాన్–హార్మోజ్ స్ట్రెయిట్ వివాదం, ప్రపంచ శాంతి చర్చల్లో నిలకడ లేకపోవడం వంటి పరిణామాల మధ్య ట్రంప్ భారత్‌కు రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ పర్యటన ద్వారా భారత్–అమెరికా మధ్య ద్వైపాక్షిక, వ్యూహాత్మక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అధికారికంగా వెల్లడించారు. ప్రముఖ వార్తా సంస్థ ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, వచ్చే ఏడాది ప్రారంభంలో ట్రంప్ భారత్‌లో పర్యటించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ట్రంప్ పర్యటన కోసం ఇరు దేశాల దౌత్య యంత్రాంగాలు ఇప్పటికే సమన్వయ చర్యలు ప్రారంభించాయని పేర్కొన్నారు. భారత్ తమకు అత్యంత కీలకమైన భాగస్వామ్య దేశమని, ఇరు దేశాల మధ్య సుదీర్ఘకాలంగా బలమైన మైత్రి కొనసాగుతోందని గుర్తుచేశారు.అంతర్జాతీయ దౌత్యరంగంలో దేశాధినేతల మధ్య వ్యక్తిగత సత్సంబంధాలు కీలక పాత్ర పోషిస్తాయని రూబియో పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, డొనాల్డ్ ట్రంప్ మధ్య ఉన్న సాన్నిహిత్యం ద్వైపాక్షిక సంబంధాల పురోగతికి తోడ్పడుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా మోదీ–ట్రంప్ సమావేశం ఇరు దేశాల బంధాన్ని మరింత బలపరిచిందన్నారు.చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కీలక వాణిజ్య ఒప్పంద చర్చలు ప్రస్తుతం ముగింపు దశకు చేరుకున్నాయని రూబియో వెల్లడించారు. ఈ ఒప్పందం కుదిరితే భారత్–అమెరికా ఆర్థిక సంబంధాలకు కొత్త ఊపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వాణిజ్యంతో పాటు రక్షణ, సాంకేతికత, పెట్టుబడులు, భద్రత వంటి అంశాలు కూడా ట్రంప్ పర్యటనలో ప్రధాన చర్చాంశాలుగా ఉండే అవకాశం ఉంది.ట్రంప్ పర్యటనకు ముందుగా తానే ఈ ఏడాది చివర్లో భారత్‌ను సందర్శించనున్నట్లు రూబియో తెలిపారు. ఈ సందర్భంలో ట్రంప్ పర్యటనకు సంబంధించిన తుది అజెండా, సమావేశాల ముసాయిదా సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. అలాగే అంతర్జాతీయ భద్రతకు కీలకమైన క్వాడ్ కూటమి తదుపరి సమావేశంలో కూడా భారత్, అమెరికా భాగస్వామ్యం మరింత బలపడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.



# బెంగళూరులో భారీ మిషన్ ప్రకటించిన డీకే శివకుమార్





- కెంపేగౌడ స్మారక అభివృద్ధికి రూ.100 కోట్ల భారీ ప్రణాళిక
- బెంగళూరు పునరుజ్జీవనానికి ప్రభుత్వం కొత్త కార్యాచరణ
- 15 లక్షల మొక్కలతో గ్రీన్ డ్రైవ్‌కు శ్రీకారం
- కెంపేగౌడ వారసత్వ పరిరక్షణకు ప్రత్యేక నిధులు

**బెంగళూరు, వెలుతురు జూన్ 27:**

నాడప్రభు కెంపేగౌడ 517వ జయంతిని పురస్కరించుకుని కర్ణాటక ప్రభుత్వం ప్రతిష్టాత్మక అభివృద్ధి కార్యక్రమాలను ప్రకటించింది. కెంపేగౌడ చారిత్రక వారసత్వాన్ని పరిరక్షిస్తూ, ఆయన ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బెంగళూరులో సుమారు 10,000 మందితో భారీ మారథాన్ నిర్వహించి కెంపేగౌడకు ఘన నివాళులు అర్పించారు.బెంగళూరు శివార్లలోని మాగడిలో ఉన్న కెంపేగౌడ స్మారక స్థలాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.100 కోట్లతో పలు నిర్మాణ పనులు చేపట్టినట్లు డీకే శివకుమార్ వెల్లడించారు. పర్యాటకులకు అత్యుత్తమ సదుపాయాలు కల్పించేందుకు మరిన్ని నిధులు కూడా కేటాయించనున్నట్లు తెలిపారు. మెమోరియల్ ప్రాజెక్ట్ పరిధిని విస్తరించేందుకు మొత్తం 10 ఎకరాల భూమి అవసరమని, ఇందులో ఇప్పటికే 5.5 ఎకరాలను రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు వివరించారు.బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికులకు నగర వైభవాన్ని చాటిచెప్పేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో ఉన్న 108 అడుగుల ఎత్తైన కెంపేగౌడ కాంస్య విగ్రహం స్పష్టంగా కనిపించేలా సాంకేతిక మార్పులు చేయాలని విమానాశ్రయ అథారిటీకి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ విగ్రహం నగర గర్వకారణంగా నిలవాలని పేర్కొన్నారు.కెంపేగౌడ జయంతి సందర్భంగా బెంగళూరు పర్యావరణ పరిరక్షణకు బీడీఏ భారీ హరిత కార్యక్రమాన్ని ప్రారంభించింది. కెంపేగౌడ పేరుతో 15 లక్షల మొక్కలు నాటే లక్ష్యంతో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టింది. బెంగళూరు నగర పునరుజ్జీవన మిషన్ 2026–30లో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. 12 గంటల్లో 15 లక్షల మొక్కలను నాటి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించాలనే లక్ష్యంతో 243 ఎకరాల విస్తీర్ణాన్ని 49 ప్రత్యేక జోన్లుగా విభజించారు.డాక్టర్ శివరామ కారంత్ లేఅవుట్, నాడప్రభు కెంపేగౌడ లేఅవుట్, బనశంకరి 6వ దశతో పాటు నగరంలోని చెరువుల గట్లు, రాజకాలువల పరిసరాలు, వివిధ పార్కుల్లో ఈ హరిత కార్యక్రమాన్ని దశలవారీగా కొనసాగించనున్నారు. అభివృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణ రెండింటికీ సమ ప్రాధాన్యం ఇస్తూ బెంగళూరును మరింత ఆధునిక, హరిత నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని డీకే శివకుమార్ స్పష్టం చేశారు.

# ఓటర్ల జాబితాలో భారీ కోత.. 6 కోట్ల పేర్లు మాయం!

- దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల్లో భారీ ప్రక్షాళన
- ఏడాదిలో 6 కోట్ల పేర్లు తొలగించిన ఎన్నికల సంఘం
- మీ ఓటు హక్కు సురక్షితమేనా? ప్రజల్లో ఆందోళన
- బోగస్ ఓట్ల తొలగింపా.. లేక రాజకీయ వ్యూహమా?
- 12 రాష్ట్రాల్లో 10 శాతం ఓటర్లు తగ్గిన సంచలనం
- తెలుగు రాష్ట్రాల్లోనూ తుది దశకు చేరిన SIR
- ఓటర్ల జాబితాపై ప్రతిపక్షాల తీవ్ర అభ్యంతరాలు
- సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్‌తో చర్చ మరింత వేడి
- మరణించిన వారి పేర్ల తొలగింపే ప్రధాన కారణమా?
- ఎన్నికల పారదర్శకతకు SIR కీలక పరీక్ష

**న్యూఢిల్లీ,వెలుతురు జూన్ 27:**

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రక్షాళన ప్రక్రియ సంచలనాత్మక పరిణామాలకు దారితీస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చేందుకు చేపట్టిన 'ప్రత్యేక ముమ్మర సవరణ' (SIR) కార్యక్రమం ఏడాది పూర్తిచేసుకునే సరికి ఏకంగా 6 కోట్ల మంది ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగించబడటం తీవ్ర చర్చకు దారి తీసింది. గత ఏడాది జూన్ 24న బీహార్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభమైన ఈ ప్రక్రియ ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమలవుతోంది.ఎన్నికల సంఘం ప్రకారం బోగస్ ఓట్లు, మరణించిన వారి పేర్లు, ఒకే వ్యక్తి పేర్లు పునరావృతంగా నమోదైన సందర్భాలను గుర్తించి తొలగించడం వల్ల ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే ప్రతిపక్ష పార్టీలు మాత్రం ఈ ప్రక్రియ వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. తమ ఓటు బ్యాంకును బలహీనపరిచే ప్రయత్నమేనని విమర్శలు గుప్పిస్తున్నాయి. దీంతో SIR ప్రక్రియ ఎన్నికల రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.రెండో దశలో ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో భారీ మార్పులు నమోదయ్యాయి. గతంలో 50.99 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య ప్రక్షాళన అనంతరం 45.81 కోట్లకు పడిపోయింది. అంటే కేవలం ఈ దశలోనే 10.2 శాతం ఓటర్లు జాబితాల నుంచి తొలగించబడ్డారు. ఇది దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది.తొలగించిన పేర్లలో మరణించిన ఓటర్లే అధికంగా ఉన్నట్లు అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. మొత్తం 66.88 లక్షల మంది మరణించిన ఓటర్ల పేర్లు తొలగించగా, అందులో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 25.47 లక్షలు, పశ్చిమ బెంగాల్‌లో 24.16 లక్షల పేర్లు తొలగించినట్లు వెల్లడైంది. ఈ గణాంకాలు ప్రక్షాళన తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి.ప్రస్తుతం మూడో దశలో భాగంగా తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు మరో 14 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో SIR తుది దశకు చేరుకుంది. సుమారు 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలపై పరిశీలన కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత మరిన్ని మార్పులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.ఈ వివాదంపై స్పందించిన సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం చేపట్టిన సవరణ ప్రక్రియ భారత ప్రజల ప్రాతినిధ్య చట్టం పరిధిలోనే కొనసాగుతోందని స్పష్టం చేసింది. దీంతో విమర్శలకు తాత్కాలికంగా బ్రేక్ పడినప్పటికీ, సామాన్య ఓటర్లలో మాత్రం తమ ఓటు హక్కు సురక్షితమేనా అనే ఆందోళన కొనసాగుతోంది. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే బలం కావడంతో, ఈ భారీ ప్రక్షాళనలో పూర్తి పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.






# రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు: ఏసిపి సుమిత్ర

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 27:** అక్రమంగా రోడ్లపై వ్యాపారాలు చేసే వారు రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని గాజులరామారం సర్కిల్ (అసిస్టెంట్ సిటీ ప్లానర్) ఏసిపి సుమిత్ర హెచ్చరించారు.సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ మరియు కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం గాజులరామారం సర్కిల్ కార్యాలయ పరిధిలోని దేవేందర్ నగర్ రోడ్డుపై ఉన్న రహదారి ఆక్రమణలను అధికారులు తొలగించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా, ట్రాఫిక్ సులువుగా సాగడమే లక్ష్యంగా పోలీస్ శాఖ సమన్వయంతో ఈప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ACP) ఆర్. సుమిత్ర, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (TPS) బి. సరిత సేన్ తమ సిబ్బందితో కలిసి పాల్గొని పర్యవేక్షించారు.రహదారులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈసందర్భంగా అధికారులు హెచ్చరించారు.







# ములుగు జిల్లాలో సాగునీటి...

**(మొదటి పేజీ తరువాయి)**

రైతుల ప్రయోజనాలకు భంగం కలగకుండా అభివృద్ధి పనులను పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు న్యాయం చేస్తూనే ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ములుగు నియోజకవర్గ పరిధిలోని నీటిపారుదల శాఖ అభివృద్ధి పనులపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు.సమావేశంలో నీటి పారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఇరిగేషన్ ఈఎన్‌సీ రమేష్ బాబు, ములుగు ఆర్‌డీవో కృష్ణవేణి, సంబంధిత చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామప్ప–లక్నవరం గ్రావిటీ కెనాల్‌కు అవసరమైన భూసేకరణపై అధికారులు సమగ్ర నివేదికను మంత్రులకు సమర్పించారు. కాసిందేవిపేట, ఇంచెర్ల, రామచంద్రాపూర్ గ్రామాల పరిధిలో ఈ ప్రాజెక్టుకు మొత్తం సుమారు 244.23 ఎకరాల భూమి అవసరమవుతుందని తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 201.03 ఎకరాలకు మాత్రమే అవార్డులు జారీ అయినప్పటికీ భూసేకరణ పూర్తికాలేదని వివరించారు.భూసేకరణకు సంబంధించి 2020–21లో జారీ చేసిన అవార్డుల ప్రకారం ఎకరాకు రూ.2.47 లక్షల నుంచి రూ.8.26 లక్షల వరకు మాత్రమే పరిహారం నిర్ణయించారని, ప్రస్తుతం భూముల మార్కెట్ విలువలు గణనీయంగా పెరగడంతో ఆ ధరలకు రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించడం లేదని అధికారులు వివరించారు. పాత అవార్డులో నిర్ణయించిన పరిహారం ప్రస్తుత పరిస్థితులకు ఏమాత్రం అనుగుణంగా లేదని, అందువల్ల రైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.రైతులు ప్రస్తుత భూముల ధరలకు అనుగుణంగా న్యాయమైన పరిహారం చెల్లిస్తే భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారని, అయితే పాత ధరలతో భూసేకరణ కొనసాగించడం వల్ల కేసులు పెండింగ్‌లో ఉండిపోయాయని అధికారులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో పాత అవార్డులను ఉపసంహరించి ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా కొత్త భూసేకరణ ప్రక్రియ చేపట్టడమే సరైన మార్గమని అధికారులు అభిప్రాయపడ్డారు.దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి సీతక్క రైతుల ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగకుండా భూసేకరణ చేపట్టాలని స్పష్టం చేశారు. 2020–21లో జారీ చేసిన పాత భూసేకరణ అవార్డును ఉపసంహరించి, తాజా మార్కెట్ విలువల ఆధారంగా కొత్త అంచనాలు రూపొందించి వెంటనే తాజా భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

రైతులకు న్యాయమైన పరిహారం అందేలా పారదర్శకంగా భూసేకరణ చేపట్టి, రైతుల విశ్వాసాన్ని పొందుతూ పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.రామప్ప–లక్నవరం గ్రావిటీ కెనాల్ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రామప్ప చెరువు నుంచి లక్నవరం చెరువుకు గ్రావిటీ ద్వారా నీటి తరలింపు సాధ్యమవుతుందని, సుమారు 8,700 ఎకరాలకు సాగునీరు అందుతుందని అధికారులు వివరించారు. అంతేకాకుండా మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర సందర్భంగా తాగునీటి అవసరాలు తీర్చడంలోనూ, లక్నవరం పర్యాటకాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు.అదేవిధంగా పొట్లాపూర్ ప్రాజెక్టు పనులను మరింత ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని, వచ్చే వారంలోనే శంకుస్థాపన జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ములుగు జిల్లాలో కొనసాగుతున్న అన్ని సాగునీటి ప్రాజెక్టుల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, ప్రతి ప్రాజెక్టు పురోగతిపై క్రమం తప్పకుండా సమగ్ర నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ ఈఎన్‌సీకి మంత్రులు ఆదేశించారు.ప్రజలకు మేలు చేసే నిర్ణయాలకే రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు న్యాయం చేయడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం రెండూ సమానంగా ప్రభుత్వ బాధ్యతలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా...

**(మొదటి పేజీ తరువాయి)**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులతో సమన్వయం పెంచుకుని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించిన మంత్రి, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిరాశ, నిస్పృహలకు లోనుకావద్దని మంత్రి జూపల్లి అన్నారు.

పార్టీ కోసం నిజాయితీగా పనిచేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ పదవుల్లోనూ, నామినేటెడ్ పోస్టుల్లోనూ తగిన ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com